**విలేకరులు కావలెను**

'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు, మండలాలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మండల విలేకరులు కావలెను.

98498 39560



Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994

Dare to Write... Dare to fight

# వజ్రభారతి

vajrabharathi@gmail.com

ఎడిటర్ : పమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక






సంపుటి : 4 సంచిక : 288 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేదీ: శుక్రవారం 24-10-2025 పేజీలు : 10 E-mail:vajrabharathi@gmail.com


# గూగుల్ వైజాగ్ ను ఎంచుకుంది...

## మరి మీ సంగతి ఏంటి?

- యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు అబుదాబిలో చంద్రబాబు..
- ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ..
- రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి..
- అమరావతి కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఉంటుంది..
- విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం..

అమరావతి,:విశాఖపట్నంలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని, ఈ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం ఆయన యూఏఈకి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి రంగంలో పెట్టుబడి పెట్టాలని ప్రముఖ సంస్థ అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ చైర్మన్ ఖలీఫా కౌరీని కోరారు. బ్యాటరీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులపైనా చర్చించారు. హైకెపాసిటీ బ్యాటరీ స్టోరేజీ ద్వారా గ్రిడ్ డిమాండ్‌ను నిర్వహించేందుకు ఆస్కారం ఉందని అపెక్స్ ప్రతినిధులు ఆయనకు తెలిపారు. సూపర్ కెపాసిటర్స్ తయారీలోనూ అపెక్స్‌కు మంచి పేరుండడంతో ఏపీలో అందులోనూ పెట్టుబడులు పెట్టాలని సీఎం కోరారు.చంద్రబాబు ఆహ్వానాన్ని తప్పక పరిశీలిస్తామని, పెట్టుబడులు

2లో







## ఆసియాన్'కు వర్చువల్‌గా

- సదస్సును ఉద్దేశించి ఆన్‌లైన్‌లో ప్రసంగించనున్న ప్రధానమంత్రి మోదీ
- మోదీకి బదులుగా హాజరుకానున్న విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్



## కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సులో అగ్నిప్రమాదం

- బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తుండగా ఘటన
- స్కూటర్‌ను ఢీకొట్టడంతో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో 25 మంది వరకు ప్రయాణికులు సజీవదహనం
- అత్యవసర ద్వారం పగలగొట్టి బయటపడిన 12 మంది

2లో

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి, స్థానిక ఎన్నికలకు వెళ్దాం




- న్యాయ నిపుణులతో చర్చించి తుది నిర్ణయం
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం
- స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత
- గవర్నర్ ఆమోదంతో త్వరలో ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణ
- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో టీబీఎంకు స్వస్తి..
- సరికొత్త డ్రిల్లింగ్ పరిజ్ఞానంతో తవ్వకాలు
- 1,500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటు
- మంత్రివర్గం కీలక నిర్ణయాలు.. వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై వచ్చే నెల 7వ తేదీన తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం.. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై న్యాయ నిపుణుల సలహాల ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం గురువారం రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘంగా సమావేశమై పలు అంశాలపై చర్చించింది. అనంతరం రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సచివాలయంలో

2లో



## రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది

- జూబ్లీహిల్స్ ప్రచారంలో రౌడీషీటర్లు వీరంగం వేస్తున్నారు
- ఉప ఎన్నికపై సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఈ ఎన్నికలో రౌడీషీటర్ గెలిస్తే శాంతిభద్రతల పరిస్థితి ఏంటి?
- ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి అడగండి
- రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది
- బీజేపీ గురించి జూబ్లీహిల్స్ ఓటర్లు ఆలోచించడం లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమైంది..
- భారీ మెజారిటీయే మన లక్ష్యం

హైదరాబాద్: 'జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీషీటర్‌ను పోటీలో నిలబెట్టి ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టింది. కాంగ్రెస్ ప్రచారంలో రౌడీషీటర్లు పాల్గొంటూ కత్తులు, కటార్లతో ఇప్పుడే వీరంగం వేస్తున్నారు. రౌడీలను

- మిగతా 2వ పేజీలో



## ఈ నెల 30న జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ...

- ఈ వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసియా పర్యటన
- ఈ నెల 30న దక్షిణ కొరియాలో చైనా అధినేత జీ జిన్‌పింగ్‌తో కీలక భేటీ
- వాణిజ్య యుద్ధం, శాంతి చర్చలపై ప్రధానంగా దృష్టి
- జపాన్, మలేషియాల్లోనూ పర్యటించనున్న ట్రంప్

థాయ్‌లాండ్-కంబోడియా మధ్య శాంతి ఒప్పందంపై సంతకాలు

# సీఎం అభ్యర్థి తేజస్వీ

- బిహార్‌లో మహాగఠ్‌బంధన్ నుంచి ఆర్జేడీ యువనేత పేరు ఖరారు
- ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముఖేష్ సహానీ
- ఏకగ్రీవంగా ఎంపిక చేసిన కూటమి నేతలు
- పనికిమాలిన ఎన్డీఏను ఓడిస్తాం: తేజస్వీ యాదవ్

2లో






## రైతులను నిలువునా ముంచేస్తారా?

- పంట నష్టపోతే పరిహారం లేదు.. ఎరువులు, విత్తనాలు లేవు
- పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు
- ఉల్లి క్వింటాకు రూ.1,200 ఎవరికిచ్చారు?
- టమాటాను పొలాల్లోనే వదిలేస్తున్నారు
- కూటమి పాలనలో రైతాంగం పరిస్థితి దారుణం

2లో



## కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సులో అగ్నిప్రమాదం

కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున పెను విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతై, బూడిదైపోయింది. ఈ ఘోర దుర్ఘటనలో 25 మంది వరకు సజీవ దహనమైనట్లు సమాచారం. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం, కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు 40 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలం చిన్నటేకూరు వద్దకు రాగానే, వేగంగా వెళ్తున్న బస్సు అదుపుతప్పి ఓ స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో బస్సు ముందు భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికుల్లో చాలామంది గాఢ నిద్రలో ఉండటంతో ఏం జరుగుతుందో గ్రహించేలోపే మంటలు బస్సును పూర్తిగా చుట్టుముట్టాయి. క్షణాల్లోనే అగ్నికీలలు ఎగిసిపడి బస్సు మొత్తం వ్యాపించాయి. కొందరు ప్రయాణికులు అప్రమత్తమై, అత్యవసర ద్వారాన్ని పగలగొట్టుకుని బయటపడ్డారు. ఈ ఘటనలో మొత్తం 12 మంది ప్రాణాలతో బయటపడగా, వారికి కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. బస్సు పూర్తిగా దగ్ధం కావడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. ప్రయాణికుల్లో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందిన వారు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ నెల 30న జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ...

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ వారం ఆసియాలో కీలక పర్యటన చేపట్టనున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా దక్షిణ కొరియాలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ట్రంప్ జరపనున్న సమావేశంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నెల 30న ఈ కీలక భేటీ జరగనుందని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ గురువారం వెల్లడించారు. శుక్రవారం వాషింగ్టన్ నుంచి బయలుదేరనున్న ట్రంప్, ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (%ూూజుజ%) సదస్సులో పాల్గొంటారు. గతంలో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో జిన్‌పింగ్‌తో సమావేశాన్ని రద్దు చేసుకుంటానని హెచ్చరించిన ట్రంప్, తాజాగా "అన్ని విషయాలపై ఒప్పందం" కుదుర్చుకోవాలని ఆశిస్తున్నట్లు బుధవారం వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల చైనా రేర్ ఎర్త్ లోహాలపై ఆంక్షలు విధించడంతో ఇరు దేశాల మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఈ నేపథ్యంలో ఈ భేటీ ఫలితంపై ప్రపంచ మార్కెట్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ పర్యటనలో భాగంగా ట్రంప్ మొదట మలేషియా చేరుకొని ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య సదస్సులో పాల్గొంటారు. అక్కడ థాయ్‌లాండ్, కంబోడియా మధ్య చారిత్రక శాంతి ఒప్పందంపై సంతకాలను పర్యవేక్షించనున్నారు. "ఈ శాంతి చర్చల సానుకూల ఫలితాలను అధ్యక్షుడు ట్రంప్ చూడాలని ఆసక్తిగా ఉన్నారు" అని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. అనంతరం జపాన్‌లో పర్యటించి, ఆ దేశ తొలి మహిళా ప్రధానిగా ఇటీవల నియమితులైన సనాయ్ తకైచీతో సమావేశమవుతారు. దక్షిణ కొరియాలో ట్రంప్ పర్యటన మరింత కీలకం కానుంది. అక్కడి అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో భేటీ అవ్వడంతో పాటు, వ్యాపారవేత్తలతోనూ సమావేశమవుతారు. మరోవైపు ట్రంప్ పర్యటనకు కొద్ది రోజుల ముందే ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడం ఉద్రిక్తతలను పెంచింది. దీంతో సైనిక రహిత జోన్ (డీఎంజెడ్)లో పర్యటనలను దక్షిణ కొరియా నిలిపివేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో మరోసారి సమావేశమయ్యే అవకాశాలున్నాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై వైట్ హౌస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## సీఎం అభ్యర్థి తేజస్వీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో విపక్ష మహాగఠ్‌బంధన్ (మహాకూటమి) తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించింది. ఊహాగానాలకు తెరదించుతూ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి గా రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) యువనేత తేజస్వీ యాదవ్ పేరును కూటమి పక్షాలు ఏకగ్రీవంగా ఖరారు చేశాయి. తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) అధినేత ముఖేష్ సహానీ పేరును ప్రకటించాయి. సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థుల ఎంపికపై కొన్నిరోజుపాటు జరిగిన చర్చోపచర్చలు ఎట్టకేలకు ముగిశాయి. కూటమి నేతలు గురువారం పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిహార్‌లో మార్పు కోసం ఏడు పార్టీల మహాగఠ్‌బంధన్ ఐక్యంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా యువనేత తేజస్వీ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ చెప్పారు. ఆయన నవ యువకుడు అని, ఏది చెబితే అది చేస్తారని, ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటారని వెల్లడించారు. కూటమిలో కీలక నేత ముఖేష్ సహానీ పేరు ప్రతిష్టలను దృష్టిలో పెట్టకొని ఆయనను డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో సామాజిక నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకొని సీఎం, డీప్యూటీ సీఎం అభ్యర్థులను ఖరారు చేశామని వెల్లడించారు. తమ పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు కూటమి నేతలను సంప్రదించి తుది నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కూడా మరికొందరిని ఉప ముఖ్యమంత్రులుగా నియమిస్తామని స్పష్టంచేశారు.

## రౌడీ షీటర్‌కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

గెలిపిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఇజ్జత్ (గౌరవం) ఉంటుందా? రౌడీషీటర్‌గా పేరున్న కాంగ్రెస్ అభ్యర్థి పొరపాటున గెలిస్తే నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంటుంది. రౌడీషీటర్ కుటుంబం నుంచి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థిని చిత్తుగా ఓడించి నియోజకవర్గ గౌరవంతోపాటు హైదరాబాద్‌లో శాంతిభద్రతలను ఓటర్లు కాపాడుకుంటారనే నమ్మకం ఉంది'అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రజలతో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలనపై అవగాహన కల్పించి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి భారీ మెజారిటీ సాధించేలా కష్ట పడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఎర్రవల్లి నివాసంలో గురువారం కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు సాగిన సుదీర్ఘ సమావేశంలో పార్టీ అభ్యర్థి గెలుపు, భారీ మెజారిటీ సాధన కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ఎత్తుగడలు, కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

## ఆసియాన్'కు వర్చువల్‌గా

న్యూఢిల్లీ: మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఈ నెల 26 నుంచి 28వ తేదీ దాకా జరుగనున్న అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఆసియన్ నేషన్స్(ఆసియాన్) 22వ శిఖరాగ్ర సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా హాజరుకానున్నారు. ఆయన గురువారం మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడారు. ఆసియాన్ సదస్సుకు స్వయంగా హాజరుకాలేనని, వర్చువల్‌గా ప్రసంగిస్తానని తెలియజేశారు. "నా మిత్రుడు అన్వర్ ఇబ్రహీంతో చక్కటి సంభాషణ జరిగింది. ఆసియాన్‌కు సారథ్యం వహిస్తున్నందుకు ఆయనకు అభినందనలు తెలియజేశా. వచ్చేవారం జరిగే సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటున్నా. ఈ సదస్సులో వర్చువల్‌గా పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఆసియాన్%-%ఇండియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలన్నదే నా ఆకాంక్ష" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. షెడ్యూలింగ్ సమస్య వల్లే మోదీ ఆసియాన్ సదస్సుకు వెళ్లలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఆయనకు బదులు ఈ సదస్సులో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్



ట్రంప్ సైతం హాజరు కాబోతున్నారు. మలేషియాలో మోదీ, ట్రంప్ ప్రత్యేకంగా సమావేశమవుతారని తొలుత ప్రచారం జరిగింది. మోదీ గైర్హాజరు కానుండడంతో ఈ భేటీ లేనట్లే. అలాగే మోదీ మలేషియాకు వెళ్లడం లేదు కాబట్టి కాంబోడియా పర్యటన కూడా వాయిదా పడినట్లేనని స్పష్టమవుతోంది. ఆసియాన్ 1967 ఆగస్టు 8న ఐదు దేశాలతో ఏర్పాటయ్యింది. ప్రస్తుతం ఈ కూటమిలో ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనై, వియత్నాం, లావోస్, మయన్మార్, కాంబోడియా దేశాలకు సభ్యత్వం ఉంది. ఆసియాన్%-%భారత్ మధ్య 1992లో భాగస్వామ్యం మొదలయ్యింది. 1995 డిసెంబర్‌లో పూర్తిస్థాయి భాగస్వామ్యంగా, 2002లో శిఖరాగ్ర స్థాయి భాగస్వామ్యంగా, 2012లో వ్యూహాత్మక భాగస్వామ్యంగా సంబంధాలు బలపడ్డాయి. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ తదితర రంగాల్లో ఇరుపక్షాలు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ట్రంప్ నుంచి తప్పించుకోవడానికే మోదీ వెళ్లడం లేదు: కాంగ్రెస్ ఆసియాన్ సదస్సుకు స్వయంగా హాజరుకాకూడదని, వర్చువల్‌గా ప్రసంగించాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం 'ఎక్స్'లో తప్పుపట్టారు. మోదీ కౌలాలంపూర్‌కు వెళ్లకపోవడానికి అసలు కారణం వేరే ఉందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుపడకుండా తప్పించుకోవడానికే మోదీ ఆసియాన్ సదస్సుకు దూరంగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశానంటూ ట్రంప్ ఇప్పటిదాకా 53 సార్లు చెప్పారని అన్నారు. అలాగే రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయదనిమోదీ హామీ ఇచ్చారంటూ కూడా ఐదుసార్లు చెప్పారని గుర్తుచేశారు. ట్రంప్ ప్రకటనలను మోదీ కనీసం ఖండించలేదని ఆరోపించారు. పైగా ట్రంప్‌ను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారని మండిపడ్డారు. ట్రంప్‌ను స్వయంగా కలిసి మాట్లాడే ధైర్యం మన ప్రధానమంత్రికి లేదని జైరామ్ రమేశ్ ధ్వజమెత్తారు.

## రైతులను నిలువునా ముంచేస్తారా?

అమరావతి: 'రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా ఉంది.. ఇప్పటికీ డీఏపీ, యూరియా దొరక్క రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంత దారుణ పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రాయలసీమ ప్రాంతంలో వేరు శనగ (బుడ్డ శనగ) విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే, గత నెల నుంచి సబ్సిడీ విత్తనాలిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసిందే తప్ప ఇంతవరకు కార్యాచరణే ప్రకటించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రైతులు దయనీయ, దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతులను ఆదుకోవడంలో చంద్రుబాబు ఘోరంగా వైఫల్యం చెందారని మండిపడ్డారు. 'ఉల్లి రైతును గాలికొదిలేశారు. గడిచిన 60ుురోజుల నుంచి కిలో రూ.3 కన్నా దాటడం లేదు. ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 ఇస్తాుమని చెప్పింది. ఎవరికిస్తున్నారో ఎవరికీ తెలియదు.' ఎవరికీ ఇచ్చిందీ లేదు. ప్రభుత్వంపై రైతులు నిరసన తెలిపేసరికి హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటివరకు విధివిధానాలే రూపొందించలేదు. ధాన్యానికి గతేడాది గిట్టుబాటు ధర లేక బస్తా రూ.1,100 నుంచి రూ.1,200కు తెగనమ్ముకునే పరిస్థితి. ఈ ఏడాది పరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటా పత్తి గతంలో రూ.12 వేలు పలికితే, ఇప్పుడు రూ.5,500కు మించి పలకడం లేదు. అరటి పంట గతంలో టన్ను గరిష్టంగా రూ.28 వేలు పలికితే ఇప్పుడు రూ.3,500కు మించి పలకడం లేదు. కూలి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు టమాటా పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. దెబ్బతిన్న ఏ సీజన్‌లో కూడా బీమా కానీ, పంట నష్టపరిహారం కానీ ఇవ్వడంలేదు. అంతెందుకు ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగితే ఏ అధికారి కూడా వెళ్లి ఎన్యుమరేషన్ చేయలేదు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో చెప్పడానికి ఇంతకంటే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు' అని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.





## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి, స్థానిక ఎన్నికలకు వెళ్దాం

(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నవంబర్ 3న హైకోర్టులో జరగనున్న విచారణలో వెలువడే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. నవంబర్ 7న మళ్లీ మంత్రివర్గ సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ తీర్మానించినట్లు వివరించారు. శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు సొరంగం తవ్వకాల కోసం ఇప్పటి వరకు అనుసరించిన టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) విధానాన్ని పక్కనబెట్టి, అత్యాధునిక డ్రిల్లింగ్ పరిజ్ఞానంతో మిగతా పనులు పూర్తిచేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. దివాళా పరిష్కార ప్రక్రియను ఎదుర్కొంటున్న నిర్మాణ సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్‌తో గతంలో చేసుకున్న ఒప్పందాన్నే కొనసాగిస్తూ ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా 2026 చివరి నాటికి లేదా 2027 ప్రారంభం నాటికి లేదా 2028 జూన్‌లోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా ఫ్లోరైడ్ బాధిత నల్లగొండ జిల్లాకు 30 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి 3.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రారంభించిన ఎస్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణం ప్రాజెక్టును గత బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. 44 కి.మీ.ల సొరంగం తవ్వాల్సి ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 31%-%32 కి.మీల తవ్వకాలు జరిగాయని, ఆ తర్వాత 10 ఏళ్లలో బీఆర్ఎస్ సర్కారు 2%-%2.5 కి.మీ.ల మేర మాత్రమే తవ్వకాలు జరిపిందని విమర్శించారు. ప్రపంచంలోనే అతి పొడువైన 44 కిలోమీటర్ల సొరంగంలో రెండు వైపుల నుంచి ఇప్పటివరకు 35 కిలో మీటర్ల సొరంగం తవ్వకం పూర్తయింది. మిగిలిన 9 కిలోమీటర్ల సొరంగం తవ్వడానికి అటవీ, పర్యావరణ, వన్య ప్రాణులకు ఇబ్బంది లేకుండా అత్యాధునిక పరిజ్ఞానాన్ని వాడాలని కేబినెట్ తీర్మానించింది. రాష్ట్రంలో 1,500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటు ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ యూనిట్లను ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై విద్యుత్ శాఖ తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. రామగుండంలో 52 ఏళ్ల క్రితం నిర్మించిన 62.5 మెగావాట్ల థర్మల్ బీ%-%స్టేషన్‌ను తొలగించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఇప్పుడున్న విద్యుత్తు అవసరాలు, రాబోయే పదేళ్ల విద్యుత్ డిమాండ్ అంచనాలకు అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళిక తయారు చేయాలని విద్యుత్ శాఖను కేబినెట్ ఆదేశించింది. సౌర, బ్యాటరీ స్టోరేజీ, రివర్స్ పంపింగ్ ద్వారా అందుకు అవసరమైన విద్యుదుత్పత్తికి వ్యూహాలు సిద్ధం చేయాలని కోరింది.

## గూగుల్ వైజాగ్ ను ఎంచుకుంది...

(మొదటి పేజీ తరువాయి)

పెడతామని అపెక్స్ హామీ ఇచ్చింది. అపెక్స్ సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని సీఎం కోరగా.. తప్పనిసరిగా పంపుతామని, సముద్రమార్గంలో వాటిని పంపుతామని చైర్మన్ ఖలీఫా తెలిపారు. ఆతిథ్య రంగంలోనూ ఈ సంస్థ ఉండడంతో అందులోనూ పెట్టుబడులకు చంద్రబాబు ఆహ్వానించారు. అనంతరం పునరుత్పాదక ఇంధన రంగంలో పేరొందిన మస్దార్ సంస్థ సీఈవో మొహమ్మద్ జమీల్ అల్ రమాహీతో ఆయన భేటీ అయ్యారు. ఏపీ-మస్దార్ మధ్య భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. సౌర, పవన, గ్రీన్‌హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దిగ్గజ సంస్థ అగ్తియా గ్రూప్ సీఈవో సల్మీన్ అల్మేరీతోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. హార్టికల్చర్, ఆక్వా కల్చర్‌లో ఏపీలో పెట్టుబడులకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని.. రాష్ట్రంలో కోకో ఉత్పత్తి జరుగుతోందని.. చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని పరిశీలించాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అవసరమైన అపారమైన వనరులు ఏపీలో ఉన్నాయని, ఒకసారి పర్యటించాలని సీఎం విజ్ఞప్తి చేయగా.. అగ్తియా సీఈవో సానుకూలంగా స్పందించారు. లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీతో జరిగిన సమావేశంలో.. ఏపీలో మాల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెడుతున్న పెట్టుబడులపై చర్చించారు. యూఏఈకి చెందిన సంస్థలతో ఏపీలో పెట్టుబడులు పెట్టించేందుకు సహకరించాలని యూసఫ్ అలీని సీఎం కోరారు. దక్షిణాసియాలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉన్న ఏపీ.. ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని చంద్రబాబు స్పష్టం చేశారు. అబూధాబీలోని అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఏ స్క్వేర్‌లో అబూధాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ఆయన సమావేశమయ్యారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు అనువుగా ఉన్నట్లు తెలిపారు. సదరు కంపెనీ-ఏపీ మధ్య సాంకేతిక సహకారంపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. అనంతరం అబూధాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ42 సీఈవో మన్సూర్ అల్ మన్సూరీతోనూ సీఎం సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు జనవరి



నుంచి అందుబాటులోకి వస్తాయని వారికి తెలిపారు. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 సంస్థను.. ఏఐ డేటాసెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. రెండో రోజు పర్యటనలో చంద్రబాబు అబూధాబీలో ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో మొత్తం 9 సమావేశాలు నిర్వహించారు.



# వీరవాసరం సొసైటీ సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

## నూతన కార్యవర్గం రైతులకు అందుబాటులో ఉండాలి .. ఎమ్మెల్యే అంజిబాబు

**వీరవాసరం , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం:** వీరవాసరం వ్యవసాయ పరపతి సొసైటీ సంఘం చైర్మన్ వీరవల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా బండారు మణికంఠ బ్రహ్మానందం, దూసనపూడి శ్రీనివాస్ లు గురువారం (త్రీ సభ్య కమిటి) ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పీఏసిఎస్ లు రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని, గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. సొసైటీ సంఘం అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలన్నారు. రాజ్యసభ మాజీ సభ్యురాలు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జనసేన, టిడిపి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, మంతెన రామరాజు, మహిళా సాధికారత చైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిని వారికి గుర్తింపు ఉంటుందని, రైతులకు కావాల్సిన రుణాలు మంజురు చేయాలని, తక్కువ వడ్డీరేటుతో రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పోరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, భీమవరం మార్కెట్ కమిటీ చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు, వైస్ చైర్మన్ బండి రమేష్, ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచ్ లు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు వీర మహిళలు, తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆచంట ఎంపిడిఓ కు ఉత్తమ ప్రతిభ అవార్డు



**ఆచంట , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** సూపర్ జి ఎస్ టి క్యాంపెయిన్ లో ఉత్తమ ప్రతిభకు ఆచంట ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ కు ప్రభుత్వం ప్రత్యేక ప్రశంస అవార్డ్ ప్రకటించింది.నెల రోజుల పాటు మండల జి ఎస్ టి ఛాంపియన్ గా ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి అన్ని రిపోర్టులు సకాలంలో యాప్ లో నమోదు చేయడం పై అవార్డ్ ఇచ్చారు .ఈ అవార్డ్ ను శాసన సభ్యులు పితాని సత్యనారాయణ ఎంపిడిఓ కు గురువారం ఆచంటలో నిర్వహించిన కార్యక్రమంలో అందచేసి అభినందించారు

# మార్టేరు - ఆచంట ప్రధాన రహదారి రూ. 4 కోట్లతో అభివృద్ధి .. ఎంఎల్ఏ పితాని




**ఆచంట, వజ్రభారతి ,అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** ఆచంటలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయని ,మార్టేరు నుండి ఆచంట ప్రధాన రహదారి ని రూ. 4 కోట్లతో అభివృద్ధి చేసినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు . పల్లె పల్లెకు పితాని కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ బైపాస్ రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకున్నామని, అన్న కాంటీన్ త్వరలో ప్రారంభమవు తుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి తాగునీటి పైపులైన్లు, గైనకాలజీ విభాగానికి డాక్టర్ నియామకం చేపట్టినట్లు వివరించారు.ఇళ్లు కట్టుకోవాలనుకునే వారికి రూ. 2 లక్షల సహాయం అందిస్తామని, పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఆచంట నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి రూ. 15 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.ఆచంట ముత్యలగుడిమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 2.5 కోట్లు నిర్మాణం చేయనున్నామని, గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు , కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై .. వివిధ శాఖల జిల్లా అధికారంతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష ..



**భీమవరం , వజ్రభారతి,అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** పిజిఆర్ఎస్ ఫిర్యాదులను నిర్ణీత గడువులోపుగా జిల్లా అధికారుల స్వీయ పర్యవేక్షణలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై వివిధ శాఖల జిల్లా అధికారంతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 2025 నుండి 10,884 పి జి ఆర్ ఎస్ విజ్ఞాపనలను పరిష్కరించడం జరిగిందన్నారు. పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులను సక్రమంగా పరిష్కరించినది, లేనిది లోపాలను గుర్తించడానికి నియమించిన థ్రీ ఆడిట్ కమిటీ సభ్యులు 8,515 విజ్ఞాపనలకు సంబంధించి థ్రీ ఆడిట్ కమిటీ తనిఖీ నిర్వహించగా 6,429 కేసులు పరిష్కారం సక్రమంగా ఉందని 76 శాతం మంది ఫిర్యాదుదారులు సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగిందన్నారు. 2,185 ఫిర్యాదులకు సంబంధించి వివిధ కారణాలను తెలుపుతూ సక్రమంగా పరిష్కరించలేదని ఫిర్యాదారుల అభిప్రాయాన్ని థ్రీ ఆడిట్ కమిటీకి వెలిబుచ్చడం జరిగింది. వీటిలో ప్రధానంగా సరైన ఎండార్స్మెంట్ ఇవ్వలేదని, ఫోటో సరిగ్గా కనిపించడం లేదని, క్రింది స్థాయి అధికారులకు అప్పగించడం ద్వారా సరిగ్గా పరిష్కారం కాలేదని, సంబంధిత అధికారులు ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడలేదని, తదితర అంశాలపై ఫిర్యాదారులు థ్రీ ఆడిట్ కమిటీ తనిఖీల్లో అభ్యంతరాలను వ్యక్తం చేయడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు వీటిని పునః పరిశీలన చేసి లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోపుగా ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ సూచించారు. గూగుల్ మీట్ లో పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం జీవోలను ఉపసంహరించకపోతే

## పెద్ద ఎత్తున ప్రజా సహకారంతో ఉద్యమాలు నిర్వహిస్తాం ..



**తణుకు, వజ్రభారతి ,అక్టోబర్ 23 , పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రభుత్వం డిమాండ్ చేసినది .గురువారం మెడికల్ కాలేజీ పర్యవేక్షణ కమిటీ , ఐలు ఆధ్వర్యంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తణుకులో బార్ అసోసియేషన్ లో న్యాయవాదలు నుండి సంతకాల సేకరణ నిర్వహించేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్వహణ వల్ల పేద ప్రజలకు ,ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మధ్య తరగతి విద్యార్థులుకు మెడికల్ కోర్సుల్లో విద్యను అభ్యసించుటకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం పి3 విధానాన్ని అమలు చేయడం వల్ల ప్రజలు నష్టపోతారని వారు తెలిపారు. రాష్ట్రంలో కేవలం రూ 6,000 కోట్లు నిధులు కాలేజీల నిర్మాణానికి ఖర్చు చేస్తే సరిపోతుందని దీనిని ప్రైవేటు యాజమాన్యం ద్వారా నిర్వహించాలని అనుకోవడం అసమర్థత ప్రభుత్వ పరిపాలనకు నిదర్శనమే అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం విదేశీ సంస్థలకు రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే వేల కోట్ల రూపాయలు రాయితీలు చేస్తున్నారని రాష్ట్రంలో ఉన్న విద్యా, వైద్యానికి నిధులు కేటాయిస్తే అభివృద్ధి జరుగుతుందని వారు తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 590 జీవోను గత ప్రభుత్వము ప్రవేశపెట్టిన 107 108 జీవోలను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీకి పూర్తి సహాయ సహకారాలు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం జీవోలను ఉపసంహరించ కపోతే పెద్ద ఎత్తున ప్రజా సహకారంతో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు పి రమేష్ , చింతపల్లి నాగేశ్వరరావు, బి. వెంకటేశ్వరరావు, దొమ్మేటి సూర్యనారాయణ పి శ్రీనివాసులు కామన మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



# పి.ఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

**భీమవరం , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** పి.ఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం అమలుపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పి.ఎం ఆవాస యోజన గ్రామీణ్ కింద అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టేందుకు జిల్లాలోని 319 రెవిన్యూ గ్రామాల్లో అక్టోబర్ 22 నుండి సచివాలయ సిబ్బందితో సర్వే ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సర్వే నవంబర్ 5వ తేదీ లోపు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంటు, రెవెన్యూ అధికారులు జారీ చేసిన స్థలం పట్టా జిరాక్స్ కాపీలను సిద్ధంగా ఉంచుకోవాలని, అలాగే అర్హులుగా ఉండి సొంత స్థలం కలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని గృహంలేని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, డి.ఇ లు, పాల్గొన్నారు.

# చించినాడ గోదావరి బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న మహిళను కాపాడిన జిల్లా పోలీసు సిబ్బంది...

**నరసాపురం , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** చించినాడ గోదావరి బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న మహిళను పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు సిబ్బంది కాపాడారు. వివరాలు ఎలా ఉన్నాయి.భీమవరం ప్రాంతానికి చెందిన ఒక మహిళ వీరవాసరంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తనకున్న సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

దీంతో గురువారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఆమె చించినాడ బ్రిడ్జి వద్దకు చేరుకుని గోదావరి నదిలోకి దూకడానికి ప్రయత్నించారు. అదే సమయంలో ఎన్ హెచ్ -216 పై హైవే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసు హెూంగార్డు పిల్లి శ్రీనివాస్ ఆ దృశ్యాన్ని గమనించారు. ఆయన వెంటనే సమయస్ఫూర్తితో స్పందించి ఆమె దగ్గరకు వెళ్లి బ్రిడ్జిపై నుంచి దూకడానికి ప్రయత్నిస్తున్న ఆమెను చాకచక్యంగా అడ్డుకుని సురక్షితంగా రక్షించారు.అనంతరం, హెూంగార్డు శ్రీనివాస్ ఈ విషయాన్ని సదరు మహిళ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకునే వరకు ఆమెను అక్కడే ఉంచి ధైర్యం చెప్పారు.




అనంతరం, ఆమెను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది.చాకచక్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన హెూంగార్డు పిల్లి శ్రీనివాస్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి.పి. గాంధీ






**ప్రత్తిపాడు వజ్రభారతి ప్రతినిధి. ఎం.వీరబాబు అక్టోబర్ :- 23:** ఆకుముడత పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.అరెంపూడిలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో పొలం పరిశీలన చేసి ప్రస్తుత వాతావరణం మబ్బులతో,చిరుజల్లులతో ఉండడంవల్ల ఆకుముడత పురుగు ఆశించడానికి వీలుందని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు తెల్లబడతాయి.చిరుపోట్ట దశలో ఈ పురుగు ఆశించినపుడు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2గ్రా.లేదా ఎసిఫేట్ 1.5గ్రా.లేదా క్లోరా%శీ%ట్రీనిలిప్రోల్ 0.3మీ. లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి అని వివరించారు.అనంతరం రైతులకు వివిధ రసాయనాలు పంటలకు వాడే సమయ%శీ%లో పాటించాల్సిన జాగ్రత్తలు గూర్చి,ప్రస్తుత వరి పంట దశలో నీటి యాజమాన్యం గూర్చి,పొటాష్ ఆవశ్యకత గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఏ ఈ ఓ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు జగదీశ్,రజాక్,రైతులు పాల్గొన్నారు.

# పుష్కర ఘాట్ లో కార్తిక దీపం ఏర్పాటు



**తాళ్లపూడి, వజ్ర భారతి అక్టోబర్ 23:** మండలకేంద్ర మైన తాళ్లపూడి పుష్కర ఘాట్ లో గోదావరి నది తీరంలో కార్తీకమాసం సందర్భంగా నిత్యం వెలిగేలా కార్తిక దీపం ఏర్పాటు చేశారు. గౌతమేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి ఆలయాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ గణపతి యువజన సంఘం సహకారంతో గోదారమ్మకు కార్తిక దీపం ఏర్పాటు చేసారు. ఆధ్యాత్మిక పురాణ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ కార్తికదీపం ప్రాధాన్యతను విని గోదారమ్మకు కార్తిక దీపాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అప్పుడప్పుడు నూనెని పోస్తూ వత్తిని సరిచేస్తూ నెలరోజులూ దీపం వెలిగేలా భక్తులు సహకరించాలని కవల శ్రీనివాస్ విజ్ఞప్తి చేసారు. గోదావరి గాలిని తట్టుకుని నిరంతరం వెలిగేలా అద్దాల పెట్టెలో దీపాన్ని ఏర్పాటు చేసారు.కార్తిక దీపం ప్రారంభ కార్యక్రమంలో పరస రాధాకృష్ణ, వెలుగుల అన్నవరం, డి.వి.వి సత్యనారాయణ దంపతులు, కిల్లాని అప్పారావు, సింగం శివరామకృష్ణ నందమూరి రాజు తదితరులు పాల్గొన్నారు. కార్తిక దీపానికి పూజలు జరిపి ప్రదక్షిణలు చేసారు .



## ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**రౌతులపూడి ( వజ్రభారతి ప్రతినిధి )అక్టోబర్ 23:** పితృవియోగంతో బాధపడుతున్న రౌతులపూడి మండల అధ్యక్షురాలు గంటిమల రాజ్యలక్ష్మి ను ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపులు సత్య ప్రభ రాజా పరామర్శించారు. అనంతరం రాజ్యలక్ష్మి తండ్రి చిత్రపటానికి నివాళులర్పించారు. మృతికి సంబంధించిన వివరాలు రాజ్యలక్ష్మి ని అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, రౌతులపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, బుచ్చి సీతమ్మ సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, మాజీ ఎంపీపీ ఇట్టంశెట్టి సూర్య భాస్కరరావు, రౌతులపూడి తెలుగుదేశం నాయకులు పసగొడుగుల వెంకటరమణ పాల్గొన్నారు.

## తాడిపూడి సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



**తాళ్లపూడి, వజ్ర భారతి అక్టోబర్ 23:** తాళ్లపూడి మండలం లోని తాడిపూడి సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు నామ కొండబాబు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెగా ఉచిత వైద్య శిభిరాలు ఏర్పాటు చేయటం, కార్పోరేట్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొనే కార్యక్రమలు చేపట్టడం పట్ల కొండబాబును ఎమ్మెల్యే అభినందించారు. ఎన్డీయే ప్రభుత్వం లో పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని ఈ పథకం లో పొందలేని వైద్యసేవలకు సి.ఎం.రిలీఫ్ ఫండ్ నుంచి వారిని ఆదు కుంటున్నామని తెలిపారు. ఈ కార్య క్రమం లో ఏ.ఎం.సి. చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, టీడీపీ నాయకులు సిద్ధ దుర్గారావు, సొసైటీ కార్యదర్శి బొర్రా రామచంద్రం, ఎండోమెంట్ ఈ.ఓ సూర్య ప్రకాష్ వివిధ గ్రామాల నుండి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తాడిపూడి లో డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ముప్పిడి.



**తాళ్లపూడి, వజ్ర భారతి అక్టోబర్ 23:** ఎన్డీయే ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాతే అభివృద్ధి కి బాటలు వేస్తోందని, గత ప్రభుత్వం లో గ్రామాల్లో సైతం అభివృద్ధి కుంటుపడిందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరవు తెలిపారు. జెడ్పి నిధులు 15 లక్షలతో తాడిపూడి లో డ్రైన్ ల నిర్మాణానికి ఎమ్మెల్యే ముప్పిడి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయం ఎన్డీయే కూటమి ఒక విజన్ తో పనిచేస్తోందని అన్నారు. అనంతరం ఆయన సోసైటీ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య మెగా శిభిరం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల పనితీరును పరిశీలించిన సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు



**తాళ్లపూడి, వజ్ర భారతి అక్టోబర్ 23:** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో కొత్తపేట నందు ప్రజల ఇబ్బందులను దృష్టి లో పెట్టుకుని అవసరమైన పైప్ లైన్ పనులు చేపట్టి మంచి నీటి పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు సర్పంచ్ కొమ్మిరెడ్డి పరస రామారావు తెలిపారు. ఉచిత మంచినీటి టాప్ సౌకర్యం కల్పించడం జరిగింది అని తెలియజేశారు. అలాగే స్థానిక జూనియర్ కాలేజీ వద్ద పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది చేపట్టిన పనులు ను పరిశీలించినట్లు, కార్తీక మాసం సందర్భంగా గోదావరి రేవులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టి, మహిళలకు రేవుల వద్ద వసతి సౌకర్యాలను కూడా కల్పించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

**రౌతులపూడి ( వజ్ర భారతి ప్రతినిధి )అక్టోబర్ 23 :** మండలంలోని ఏ మల్లవరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు క్రీడా స్థలం అభివృద్ధి కోసం తన సొంత నిధులు సుమారు లక్ష రూపాయలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమా శ్రీనివాసరావుకు అందజేశారు. ఇటీవల కాలంలో ఈ పాఠశాలలో ఒక కార్యక్రమం నిమిత్తం వరుపుల సత్యప్రభ రాగా అక్కడ ఉన్న పి ఈ టి ఉపాధ్యాయులు పిల్లలు ఆడుకోవడానికి సరైన టెన్నిస్ కోర్టు లేదని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఆ ఇచ్చిన మాట కు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎమ్మెల్యే తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని సత్య ప్రభ అన్నారు. గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్య చెప్పిన వెంటనే స్పందించి తన సొంత నిధులను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే సత్య ప్రభకు మా పిల్లల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఇటీవల కాలంలో ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు సుమారు 20 ఫ్యాన్ అంద చేసి తన దాతృత్వం చాటుకున్నారని శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు, రౌతులపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమరాల సత్యనారాయణ, కత్తిపూడి బుచ్చి సీతమ్మసత్వం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, మల్లవరం స్థానిక తెలుగుదేశం నాయకులు లెక్కల రాము, గవిరెడ్డి



గురునాథ్, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కర్ బాబు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వెన్న శివ, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బద్ది రామారావు ప్రతిపాడు నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు యాళ్ల జగదీష్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంటాక్ట్ పారిశుధ్య, సెక్యూరిటీ, క్వెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి !





**తణుకు, వజ్రభారతి,అక్టోబరు 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** జిల్లాలో ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య, సెక్యూరిటీ, క్వెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి వేతనబకాయిలు,పి.ఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు,మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కోనాల భీమారావు డిమాండ్ చేసారు. గురువారం తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ జిల్లాలో గత 20 ఏళ్ళ క్రితం 30 పడకలగా వున్న అనేక హాస్పిటల్స్ 30 నుంచి 50,100,150 పడకలకు విస్తరించడం జరిగిందని,అనేక నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. హాస్పిటల్స్ స్థాయి పెరిగిన పడకలు, నూతన భవనాలకనుగుణంగా పారిశుధ్య కార్మికుల పెంపు జరుగలేదన్నారు. దీంతో తీవ్ర పనిభారంతో కార్మికులు అనారోగ్యాల బారిన పడుతున్నార న్నారు.కొన్ని హాస్పిటల్స్ లో వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు . సెక్యూరిటీ కార్మికుల వేతనాల చెల్లింపులో కాంటాక్టరు ఒక్కో కార్మికుడు నుంచి ప్రతీ నెలా రూ 2 వేలు దోపిడీ చేస్తున్నారన్నారు. ఇంకా అనేక సమస్యలతో కాంట్రాక్టు కార్మికులు సతమతమవుతూ విధులు నిర్వర్తిస్తున్నా రన్నారు.వీరి స్థితిగతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని భీమారావు కోరారు.

**ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ గోదావరి జిల్లా నూతన సమితి ఎన్నిక...**

ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన సమితిని సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ జిల్లా అధ్యక్షునిగా కోనాల భీమారావు, ప్రధాన కార్యదర్శిగా బందా సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముదునూరి శ్రీహరి రంగరాజు, కోశాధికారిగా వసంతాడ వీరాస్వామి, ఉపాధ్యక్షులుగా కస్పా లక్ష్మినారాయణ,కె. కృష్ణ కుమారి, సహాయ కార్యదర్శులుగా అడ్డాల వెంకటలక్ష్మి, బి.వెంకటలక్ష్మి,జిల్లా కమిటీ సభ్యులుగామొగలాపు సుధారాణి,టి.శారమ్మ,పి. దానేశ్వరి, ఎలిపే హైమావతి, మెరిపే బేబి, సీహెచ్ రాజశేఖర్, బి. మంగతాయారు, సీహెచ్ కుమారి, బి. శాంతకుమారి, జి. రవిప్రసాద్, పి. రమేష్ బాబు, పేకేటి రవికుమార్, డి. పుష్పలత, పంపన రేణుక, భారతి ఎన్నికయ్యారు.

# జిల్లాలో రానున్న రెండు రోజులు పాటు భారీ వర్షాలు

**భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**వర్షంలో విద్యుత్ స్తంభాలను తాకరాదు**

**ప్రజల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 08816-299219 ఏర్పాటు**



**భీమవరం , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పట్ల జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.గండి పడే అవకాశం ఉన్న కాలువలు, చెరువులు, నదీ పరివాహ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలు పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఉన్నత అధికారుల కు తక్షణం సమాచారం అందించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంటలు రక్షించుకునే విధంగా రైతులకు తగు సూచనలు జారీ చేయాల న్నారు. చెరువులు, నదులు వాటి ప్రవాహం ఆధారంగా దాటుటకు, ఈదుటకు ప్రయత్నించవద్దని సూచించారు. వర్షాలు ఉన్నప్పుడు, తర్వాత కూడా తాగునీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్థంబాలు, కరెంట్ షాక్ కు అవకాశం ఉన్న వాటిని గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్థంబాలు, చెట్లు వంటివి పడినపుడు తక్షణం తొలగించాలని అన్నారు. గర్భిణీలు, అత్యవసర వైద్య సేవలు అవసరం ఉన్నవారిని తక్షణం ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. అత్యవసర శస్త్ర చికిత్సలకు విద్యుత్ అంతరాయం ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సముద్రంలోకి వేటకు ఎవరు వెళ్లవద్దని, వేటకు వెళ్ళిన వారు అక్టోబర్ 24 లోపుగా ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదని స్పష్టం చేశారు. లిభారీ వర్షాలు నేపథ్యంలో రేపు అక్టోబర్ 24 శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవును ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద, నీటి వసతులకు దగ్గరగా ఉండకుండా అందరికీ సమాచారం అందించాలని అన్నారు. రియల్ టైమ్ సమాచారం వస్తుందని, దానిని ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08816-299219 ఫోన్ నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సమాచారం అందించవచ్చని, సమాచారం పొందవచ్చని తెలిపారు.



## నిధుల వినియోగంలో నియోజక వర్గ సమతుల్యం పాటించండి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**పల్నాడు,నరసరావు పేట, వజ్రభారతి, అక్టోబరు 23:** ఉపాధి హామీ నిధుల వినియోగంలో అన్ని నియోజక వర్గాల మధ్య సమతౌల్యం ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పూర్తిగా వినియోగించాలన్నారు. ఇప్పటికే మంజూరైన అన్ని పనులను గ్రౌండింగ్ చేయాలన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డ్వామా, పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖల ప్రగతి నివేదికపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో పెండింగ్ లో ఉన్న 103 చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంపద సృష్టి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు.నాగార్జున సాగర్ నీటిని శుద్ధి చేసి ద్వారా జిల్లా ప్రజలకు తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని వెటర్నరీ ఆసుపత్రుల్లో టాయిలెట్లు నిర్మించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, భూగర్భ జల శాఖ ఏడీ రామ బాలజీ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకట్రావు, డీపీఓ నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం సరఫరా..

**తాళ్లపూడి లో మద్యం దుఃఖనాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే**

**తాళ్లపూడి, వజ్ర భారతి అక్టోబర్ 23:** నకిలీ మద్యమా, కాదా అన్నది క్యూ. ఆర్. కోడ్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతి విషయం ఎంతో పారదర్శకంగా అమలు చేస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తాళ్లపూడి మండలానికి విచ్చేసిన సందర్భం లో బ్రాందీ షాప్ ను సడన్ గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్రతిపక్షం వాళ్ళ తీరు చూస్తుంటే దొంగలే దొంగ దొంగ అన్నట్లుందని, వారి హయం లో కనీసం మద్యం కు చెల్లించే డబ్బు కూడా నగదు రూపం లోనే తీసుకున్నారని, ఏ ఖాతాకు డబ్బు వెళ్ళేదో తెలిసేది కాదని, నకిలి మద్యం గతపాలకులే కేసుల్లో ఉన్నారని , ఎన్డియే ప్రభుత్వం పూర్తి పారదర్శకత తోపని చేస్తోందని అన్నారు. వినియోగ దారులు సైతం మద్యం క్యూ.ఆర్.కోడ్ ద్వారా నాణ్యమైన మధ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్యే అన్నారు.

## మెడికల్ కాలేజీ ని ప్రైవేటీకరణ నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహాల దగ్గర కోటి సంతకాల సేకరణ



**విజయవాడ , వజ్రభారతి, అక్టోబర్ 23:** వైఎస్ఆర్సిపి రాష్ట్ర స్థాయి ఎస్సీ సెల్ విస్తృత సమావేశం గురువారం విజయవాడ సి ఎస్ ఆర్ రెసిడెన్సీలో జరిగింది. ఈ కార్యక్రానికి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ని ప్రైవేటీకరణ నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహాల దగ్గర కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టాలని చెప్పి పిలుపునిచ్చారు. రాణా రోజుల్లో ఎస్సీలంతా ఏకమై వైఎస్ఆర్ సీపీని బలోపేతం చేయాలనిపిలుపునిచ్చారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు అనంతరం గురువారం పుట్టినరోజు జరుపుకున్న రాష్ట్ర అధ్యక్షుడిని టీజేఆర్ సుధాకర్ బాబు ని కనకారావు గారిని పొట్ల సురేష్ ఘనంగా సత్కరించారు.

## వాసిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా



**ప్రత్తిపాడు వజ్ర భారతి ప్రతినిధి. ఎం. వీరబాబు అక్టోబర్ :- 23:** ఇటీవల మరణించిన వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు తండ్రి రౌతులపూడి మాజీ సర్పంచ్ కత్తిపూడి బుచ్చి సీతయ్యమ్మ సత్రం మాజీ చైర్మన్ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు( దేవుళ్ళు) కుటుంబమును ప్రత్తిపాడు నియోజక వర్గం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పరామర్శించారు ముందుగా వాసిరెడ్డి వెంకటేశ్వర్లు( దేవుళ్ళు) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు వారి కుటుంబానికి సానిభూతి తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరపులు సత్యప్రభ మాట్లాడుతూ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు (దేవుళ్ళు) మరణం చాలా బాధాకరం ఒక మంచి నేతను కోల్పోయామని సత్యప్రభ ఆవేదన వ్యక్తం చేశారు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను అని సత్య ప్రభ అన్నారు ఈ కార్యక్రమంలో రౌతులపూడి మాజీ ఎంపీపీ భాస్కర్ బాబు మార్కెట్ చైర్మన్ బుద్ధి రామారావు మణి రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ సభ్యులు వెన్నా శివ పర్వత సురేష్ రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కర్ బాబు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు







## సినీనటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** అటు సినీరంగం ఇటు సేవా రంగంలో కృష్ణంరాజు, ప్రభాస్ కుటుంబ సభ్యులు తమదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకులో ప్రభాస్ జన్మదిన వేడుకలు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో చరిత్రకు నాంది పలికిన నటుడు ప్రభాస్ అన్నారు. కేవలం తెలుగు అభిమానులనే కాకుండా దేశంలోని అభిమానుల హృదయాలను దోచుకుని డార్లింగ్‌గా మనసుల్లో ముద్ర వేసుకున్నారని చెప్పారు. తెలుగు చిత్రసీమలోనే కాకుండా ప్రభాస్ నటించిన పాన్ ఇండియా చిత్రాలుగా నిలిచాయన్నారు. వివాదాలకు దూరంగా ఉంటూ కేవలం నటుడిగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతిఒక్కరికీ సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రభాస్ కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభాస్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అభిమానులు సైతం సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. అనంతరం కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా

**కూటమి ప్రతిష్ట దెబ్బతీయడానికే కుట్ర**

**జగన్ పాలనలోనే పేదల ప్రాణాలు పోయాయి**

**మద్యం మాఫియాలో వైసీపీ నేతలే భాగస్వాములు**

**ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజం**



**తణుకు , వజ్రభారతి , అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా , ప్రతినిధి:** గత అయిదేళ్ల లిక్కర్ మాఫియా అంశంలో ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలకు ప్రణాళిక చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజమెత్తారు. కల్తీ మద్యం ఫార్ములా తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేసి కూటమి ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తయారు చేశారని ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే రాధాకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్ననాటి స్నేహితులైన జనార్ధనరావు, జోగిరమేష్‌లు నకిలీ మద్యానికి పక్కా ప్రణాళికలు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం తయారీ కంపెనీలన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి తన గుప్పెట్లో పెట్టుకుని జె బ్రాండ్లు మాత్రమే తయారు చేసి దీని ద్వారా 30 వేల మంది ప్రాణాలను తీశారన్నారు. గత అయిదేళ్లలో సరఫరా చేసిన జె బ్రాండ్లలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు, అమెరికా లాబొరేటరీలు స్పష్టం చేశాయన్నారు. టాంజానియా, ఐవరీకోస్ట్, ఘనా, జాంబియా, మొజాంబిక్ దేశాల్లో జగన్‌మోహన్‌రెడ్డి సన్నిహితులు మద్యం వ్యాపారం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జంగారెడ్డిగూడెంలో కల్తీ నాటుసారా తాగి 27 మంది పేదల ప్రాణాలు పోతే కనీసం పోస్టుమార్టం చేయలేదని, విచారణ చేయకుండా కేసును పక్కదోవ పట్టించారని ఆరోపించారు. ఇటీవల ఏలూరులో ఒకరు చనిపోతే కూటమి ప్రభుత్వం పోస్టుమార్టం చేయించి విచారణ చేపట్టిందని గుర్తు చేశారు. ఏలూరు సంఘటనకు సంబంధించిన మద్యాన్ని ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ కల్తీ మద్యం కాదని నిర్ధారించిందన్నారు. జగన్ పాలనలో 3 లక్షల బెల్టు షాపులు నిడిస్తే కూటమి ప్రభుత్వం బెల్టు షాపులకు చెక్ పెట్టిందన్నారు. మద్యం ఏ స్థాయిలోనూ కల్తీ అయ్యేందుకు ఆస్కారం లేకుండా డిస్టలరీలు, డిపోలు, మద్యం షాపులు, బార్లలో ఆకస్మిక తనిఖీలు చేసి శాంపిళ్లను సైతం సేకరించి పరీక్షలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

## నిరుద్యోగ యువతకు శుభవార్త

**పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

**జీలుగుమిల్లి (వజ్ర భారతి) అక్టోబర్ 23:** కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా జరగబోతోంది. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ జాబ్ మేళాను నిర్వహిస్తోంది. నియోజకవర్గంలోని ఏడు మండలాల యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేళాకు పదవ తరగతి నుంచి ఎం.ఫార్మసీ వరకు వివిధ విద్యార్హతలు కలిగిన వారు అర్హులు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, డి.ఫార్మసీ, బి.ఫార్మసీ విద్యార్హతలతో అభ్యర్థులు హాజరుకావచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు జాబ్ మేళాకు హాజరై మంచి ఉద్యోగాన్ని పొందవచ్చు. నిరుద్యోగ యువత తమ భవిష్యత్తును మలుచుకోవడానికి ఈ మేళా మంచి వేదిక అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు.



## కార్తీక మాసం ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి: జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**పల్నాడు:నరసరావుపేట: వజ్ర భారతి : అక్టోబర్.23:** గురువారం ఉదయం కార్తీక మాసం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ లోని ఎస్. ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అంతట ఉన్న ఆలయాల్లో జరుగుతున్న ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, డిఆర్వో ఏక మురళి, అటవీ శాఖ అధికారిని కృష్ణప్రియ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం, అమరావతిన, దైద, మల్లేశ్వర స్వామీ దేవాలయం, చేజర్ల వంటి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ఐదు దేవాలయాలు పై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే జిల్లాలో ఉన్న మిగిలిన దేవాలయాల్లో కూడా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వీటిలో పెద్ద ఆలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తగిన జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. భక్తులు ఆలయాల సందర్శనకు, రాకపోకలకు, అన్నదానానికి,ప్రసాదానికి, దర్శనానికి, తాగునీటికి, పారిశుద్ధ్యానికి , ప్రతి ఆలయంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడానికి, ప్రతి ఆలయానికి బస్సు సౌకర్యం కల్పించడానికి, ప్రతి ఆలయంలో నిరంతర విద్యుత్తు ఉండేలా చూడడానికి, సీసీ కెమెరాలు ఉంచేందుకు, వర్షాలను తట్టుకునేలా నీడనిచ్చే టెంట్లు వేయాలని,భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, నదులు వెంట ఉన్న ఆలయాలకు భద్రత పెంచేందుకు, తగిన పోలీస్ సౌకర్యం,క్యూ లైన్స్, మైకు సెట్లు, పడవలు, గజఈత గాళ్లు తదితరమైనవి తప్పకుండా జాగ్రత్తగా చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు.ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక క్యూలైన్లు,సైన్ బోర్డు ఏర్పాటుచేయాలన్నారు .సమావేశంలో దేవాదాయశాఖ అధికారులు, మూడు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు,ఆర్టీసీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారిని, డిఎస్పీలు, ఈవోలు తదితరులు పాల్గొన్నారు.




## వజ్ర భారతిలో వొచ్చిన "పొంచి ఉన్న ప్రమాదం " అనే కథనానికి స్పందించిన అధిఖారులు




వజ్ర భారతి : 23, అక్టోబర్ వెలేరుపాడు : ( రిపోర్టర్ బాబ్జి ): ఈ నెల 23 వ తేదీన గురువారం వజ్రభారతి న్యూస్ లో వొచ్చిన "పొంచి ఉన్న ప్రమాదం "అనే వార్తకు అధిఖారులు స్పందించి రహదారి కీ ఇరువైపులా ఉన్న ముళ్ళపదలను తొలగించడం జరిగినది. అధికారుల ఆదేశాలతో రుద్రం కోట గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు దగ్గర ఉండి రహదారి మీద ఉన్న ముళ్ల పొదలను తొలగించటం జరిగినది. అందుకు ప్రయాణికులు, మండల ప్రజలు ధన్యవాదములు తెలపటం జరిగినది.

## నిరంతరం ప్రజా రక్షణకై పాటుపడే హెూంగార్డ్ సిబ్బందికి అండగా ఉంటాం పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్,



**పల్నాడు : నరసరావుపేట : వజ్ర భారతి : ప్రతినిధి : అక్టోబర్ 23:** పల్నాడు జిల్లా కు చెందిన హెచ్.జి.467 టీ.వి.కె.బాబ్జీ అను హెూంగార్డు డిప్యుటేషన్ మీద వైజాగ్ స్టీల్ ప్లాంట్ నందు విధులు నిర్వహిస్తూ ది.05.06.2025 వ తేదీన ఉద్యోగ విరమణ చేయడం జరిగింది కావున అతనికి ఎస్పీ చేతుల మీదుగా ఈ రోజు 5,00,000/- రూపాయల చెక్కును అందించడం జరిగింది. హెూంగార్డు సిబ్బంది యొక్క సమస్యలను, కనీస అవసరాలను ఎప్పటికప్పుడు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్న హెూమ్ గార్డు ఆర్ ఐ. ఎస్.కృష్ణ ని ఎస్పీ అభినందించినారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు హెూంగార్డ్ ఆర్.ఐ. ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

## మా ప్రాణాలను మా పిల్లల ప్రాణాలను కాపాడండి

**బాపట్ల జిల్లా (వజ్రభారతి) అక్టోబర్ 23:** అయ్యా మున్సిపల్ అధికారులారా మేము మనుషులమే మా వైపు కొంచెం చూడండి అయ్యా. పట్టణంలోని బేతనీ కాలనీ వద్ద గల జగనన్న కాలనీలో మోకాళ్ళ లోతు నీళ్లల్లో ప్రయాణం. ఇంటి నుంచి బయటికి రావటానికి కూడా వీలుకాని పరిస్థితుల్లో మా బతుకులు ఉన్నాయి. కాలువలను తలపిస్తున్న జగనన్న కాలనీ ఈ కాలువలలో విషపురుగులు, పాములు సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇది బాపట్ల జిల్లా హెడ్ క్వార్టర్ లేక మారుమూల గ్రామమా ,కనీసం గ్రామాల్లో ఇంతకన్నా మెరుగైన వసతులు ఉన్నాయి కానీ ఇక్కడ మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితుల్లో ఉన్నాము. జిల్లా కలెక్టర్ మరియు కూటమి నాయకులు మా యందు దయచూపి మా ప్రాణాలను మా పిల్లల ప్రాణాలను కాపాడవలసిందిగా కోరుకుంటున్నాము.





# సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న 22 ఏళ్ల యువతికి మెచ్డ్ సిబ్లింగ్ ఆలోజెనిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతం




**రాజమహేంద్రవరం, వజ్ర భారతి, అక్టోబర్ 23(ఎండి నజీర్ అహ్మద్) :** సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న 22 ఏళ్ల యువతికి సికింద్రాబాద్ యశోదా హాస్పిటల్స్ నందు మెచ్డ్ సిబ్లింగ్ ఆలోజెనిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ హీమటాలజీ, బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ డాక్టర్ కే.కరుణ కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం యశోద ఆసుపత్రిలో జరిగిన మీడియా సమయంలో ఆయన మాట్లాడారు. రోగి సోదరుడు స్టెమ్ సెల్ దాతగా నిలిచారని, అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో, అనుభవజ్ఞులైన వైద్య బృందం పర్యవేక్షణలో ఈ క్లిష్టమైన వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసామన్నారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకుంటూ సాధారణ జీవనశైలిలోకి అడుగుపెడుతున్నారని. మూడు నెలల తరువాత కూడా రోగి ఆరోగ్యం స్థిరంగా ఉందన్నారు. "సికిల్ సెల్ వ్యాధి రక్తంలోని హీమోగ్లోబిన్‌లో జరిగే జన్యుపరమైన మార్పుల వల్ల ఏర్పడే తీవ్రమైన రక్త సంబంధిత వ్యాధి. దీని వల్ల రక్తకణాలు ఆకారంలో మార్పు చెంది, శరీరంలో తగినంత ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని, దీర్ఘకాలంలో అవయవ నష్టం, జ్వరం, ఎముకలు నొప్పులు వంటి తీవ్రమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్టెమ్ సెల్ లేదా బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ అత్యంత ప్రభావవంతమైన మరియు శాశ్వత పరిష్కారమని, సరైన సమయంలో చికిత్స చేయడం ద్వారా రోగులు పూర్తిగా కోలుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. విజయవంతమైన వైద్య ప్రక్రియ యశోదా హాస్పిటల్స్‌లో లభ్యమయ్యే ఆధునిక వైద్య సదుపా యాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, సాంకేతిక సిబ్బంది, మరియు రోగి సంరక్షణలో ఉన్న నిబద్ధత వలన సాధ్యమైందని. ఇటువంటి విజయాలు రోగులకు కొత్త జీవం, కుటుంబాలకు కొత్త ఆశ అందిస్తున్నాయన్నారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ కే.కరుణ కుమార్ తోపాటు ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరబద్ర, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాలిక ఫోక్స్ కేసుని 24 గంటల్లో చేదించిన పోలీసులు

**రాజమహేంద్రవరం, వజ్ర భారతి, అక్టోబర్ 23. (ఎండి నజీర్ అహ్మద్ ):** 20 వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాజమండ్రిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఉంటున్న ఓ మైనర్ విద్యార్థి దీపావళి సామాన్లు కొనడానికి బయటకు వెళ్ళగా, ఆ బాలికకు ముందుగా పరిచయం ఉన్న పాము అజయ్ అనే వ్యక్తి, అతని స్నేహితుడు అక్కడికి వచ్చి, భాదితురాలితో మాట్లాడి, వారు కుడా దీపావళి సామాన్లు కొనటానికి వెళ్తున్నట్లు మాయమాటలు చెప్పి మోటరు సైకిల్ పై ఎక్కించుకుని, ఆమెను ఆల్కాట్ గార్డెన్స్, రాజమహేంద్రవరం, రైల్వే స్టేషన్ రోడ్ లో గల గురు రెసిడెన్సి (లాడ్జి) కి తీసుకెళ్లి, వారిలో ఒక వ్యక్తి లాడ్జి క్రింద ఉండగా, రెండవ వ్యక్తి అయిన అజయ్ లాడ్జి రూంలోకి తీసుకెళ్లి ఆ మైనర్ బాలిక పై అత్యాచారం చేసి, అనంతరం ఆ బాధితురాలిని ఆమె యొక్క వసతి గృహము వద్ద వదిలి వెళ్ళినట్లు, ఆ భాదితురాలి ప్రవర్తన గమనించిన వసతి గృహ నిర్వాహకురాలు, జరిగిన విషయమును తెలుసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారము ఇచ్చి, వారు కూడా వచ్చి విషయమును భాదితురాలిని అడిగి తెలుసుకున్న తర్వాత పోలీస్ స్టేషన్ కి వచ్చి ఇచ్చిన పిర్యాదు మేరకు 137(2),65(1) ర్/వి 3(5) బీన్స్ అండ్ సెకండ్ 3(ఏ) ర్/వి 4 అఫ్ పోక్సో యాక్ట్ గా రెండవ పట్టణ పోలీసు స్టేషన్, రాజమహేంద్రవరం లో ఇన్స్పెక్టర్ పి. శివ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయటము జరిగినది. తూర్పు



గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిశోర్ ఐ.పి.స్., ఉత్తర్వుల మేరకు సౌత్ జోన్ డి.ఎస్.పి స్. భవ్య కిషోర్ సారధ్యం లో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. శివ గణేష్, సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టీ.నే.వి.స్. శ్యాం సుందర్ వారి సిబ్బంది సహాయముతో ఈ కేసులో ముద్దాయిలు అయిన A1) పాము అజయ్ S/o. ప్రసాద్, ఏ/22 సంవత్సరములు, సి/యస్.సి.-మాల, అంబేద్కర్ కాలనీ, జొన్నాడ, ఆలమూరు మండలం. ఏ 2) కాగితపల్లి సత్య స్వామి, తండ్రి రామకృష్ణ, ఏ/21 వైయస్సార్ సి/నాయి బ్రాహ్మణ, రావులపాడు గ్రామము, రావులపాలెం మండలం లో ఈనెల 22. వ తేదీ సాయంత్రం 5.00 గంటల సమయములో రాజమహేంద్రవరం, రైల్వే పార్సిల్ ఆఫీసు ఎదురుగా అనుమానాస్పదముగా తిరుగుతుండగా అరెస్ట్ చేసినారు. 5 వ ఏ జె ఎఫ్ సి ఎం కోర్ట్ నందు హాజరుపరచనున్నారు. సదురు కేసులో ముద్దాయిలను కేసు నమోదు చేసిన 24 గంటల లోపు ప్రతిభ కనబరిచి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. శివ గణేష్, సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, టీ.నే.వి.స్. శ్యాం సుందర్, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది అయిన హెచ్ సి 1790 బి.ఎం.వి.వి. భానుమూర్తి, పీసీ 1357 షేక్. రబ్బాని, పీసీ 1363 పి. మహేష్ కుమార్, పీసీ 1358 యూ. నాగబాబు, పీసీ 1079 కే. బాల సుబ్రహ్మణ్యంలను తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిశోర్ ఐపీస్ అభినందించినారు. ఈ కేసు నమోదు అయిన వెంటనే పట్టణములో ఉన్న అన్ని బాలికల వసతి గృహముల నిర్వాహకులకు తగిన సూచనలు ఇవ్వమని సంభందిత అధికారులకు తెలియచేయటము జరిగినది.శక్తీ టీం లను అన్ని బాలికల వసతి గృహముల వద్దకు పంపి వారికి అవగాహన కల్పించుట జరుగుతుంది. లాడ్జి ఓనర్ లు అందరికి మైనర్ బాలురు, బాలికలకు రూములు ఇవ్వవద్దని హెచ్చరించుట జరిగినది. మరియు సదరు లాడ్జి మీద తగు చర్యలు తీసుకోవలసిందిగా సంభందిత అధికారులకు తెలియచేయటమైనది

## లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలను అందజేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు



**పల్నాడు నరసరావుపేట : వజ్ర భారతి : ప్రతినిధి: అక్టోబర్ 23 :** నరసరావుపేటలో 217 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పట్టాలను అందజేసిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా .ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ తాము 23 వ తారీఖున తప్పనిసరిగా ఇక్కడకు వచ్చి మీకు ఇళ్ల పట్టాలను ఇస్తామని మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, ఇక్కడికి వచ్చామని మీ అందరికీ పట్టాలు ఇచ్చినందుకు సంతోషంగా ఉందని మీకు కూడా సంతోషంగా ఉన్నారని.. ఉన్నారా అని వారిలో ఉత్సాహం నింపారు. ఇక్కడకు వచ్చిన కమిటీ చైర్మన్ కోటేశ్వరరావు, మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులు, ఆర్డిఓ, మున్సిపల్ అధికారి, టిడ్కో ఎస్.సి,ఈఈ లకు కూడి వచ్చిన మీ అందరికీ సొంత ఇంటి వారవు తున్నందుకు తెలుపు తున్నానని శుభాకాంక్షలు తెలుపుతున్నాను అన్నారు. ఎన్నో టిడ్కో ఇల్లు తాను చూశానని, కానీ ఇంత చక్కగా ఇన్ని వసతులతో కూడిన ఇళ్లను ఇక్కడే చూస్తున్నాను, ఇక్కడ అన్ని వసతులు అను కూలంగా ఉన్నాయని, మరుగుదొడ్లు, మురుగు కాలవలు, తాగునీరు, వాటర్ ట్యాంక్, ఇక్కడ ఎమ్మెల్యే, ఇక్కడే మున్సిపల్ కమిషనర్, ఆర్డీఓ, టిడ్కోగృహ అధికారులు ఎంతో కష్టపడి పనిచేశారని,పోలీసులు, విద్యుత్ శాఖ,తాగునీటి వసతి సౌకర్యాలు అన్నీ వచ్చాయని జిల్లా కలెక్టర్ తెలిపారు .అనంతరం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఇల్లు ఇచ్చిన అందరూ ఇక్కడ వచ్చి ఉంటే ఇక్కడకు అంగన్ వాడి స్కూలు,పిల్లల కోసం స్కూలు, ఆసుపత్రి అన్నీ ఇక్కడికే వస్తాయని తెలిపారు.ఇంకా కోర్ట్ కేసులో పెండింగ్ లో గృహాలను త్వరితగతిన వాడుకలోకి తీసుకురావాలి మున్సిపల్ కమిషనర్ ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధులత,మున్సిపల్ కమిషనర్ యశ్వంతరావు, టిడ్కో అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## రాజయ్యపేట మత్స్యకారులకు అండగా నిలుద్దాం!

### లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన వాసుపల్లి

### సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్



**వజ్ర భారతి, విశాఖ ప్రతినిధి, అక్టోబర్ 23:** బల్క్ డ్రగ్స్ పార్కును వ్యతిరేకిస్తూ నక్కపల్లి రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. స్థానికులకు ఒప్పించి వారి ఆమోదంతోనే కంపెనీలు ఏర్పాటు చేయాలని జగనన్న మాటగా డిమాండ్ చేస్తున్నట్లు వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు. ఆసీలమెట్టలో గల పార్టీ కార్యాలయంలో దక్షిణ వైసీపీ శ్రేణులు, మత్స్యకార నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి మత్స్యకారుడిగా తన వాళ్ళు ఎక్కడ ఉన్నా.. అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు.బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకిస్తూ రాజయ్య పేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు వైఎస్సార్ సీపీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందన్నారు. స్థానికులను ఒప్పించి వారి ఆమోదంతోనే కంపెనీలు ఏర్పాటు చేయాలనీ గుర్తు చేశారు. ఇది జగనన్న మాటగా చెబుతున్నాం అన్నారు. అనకాపల్లి జిల్లానక్కపల్లి లో వందలాదిమంది పోలీసులను దించడం కూటమి సర్కార్ సిగ్గుమాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.దారులన్నీ దిగ్బంధం చేయడం పిరికి బంద చర్యగా ఆయన అభివర్ణించారు. సంఘీభావం తెలిపే నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రాజయ్యపేట మత్స్యకారులను ఒంటరి వాళ్లను చేసేందుకు యత్నించడం దారుణమన్నారు. వారం రోజులగా అమలవుతున్న కూటమి నేతల కుటిల నీతిని తుత్తునియలు చేస్తూ వైఎస్సార్సీపీ%శ్రీ% అండగా నిలిచి, మేమున్నామని భరోసా ఇచ్చిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహ న్రెడ్డి ఆదేశంతో చలో రాజయ్యపేట'కు పిలుపునిచ్చి పార్టీ అగ్ర నేతలు గ్రామాన్ని ఇటీవల సందర్శించారనీ పేర్కొన్నారు. డ్రగ్ పరిశ్రమ ఆపే వరకు మత్స్యకారులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార అనుబంధ సంఘాల నాయకులు, దక్షిణ వైయస్సార్సీపీ శ్రేణులు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, సినియర్ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలకు జీవనజ్యోతి పాఠశాల విద్యార్థినుల ఎంపిక

ఓడి చెరువు,వజ్ర భారతి అక్టోబర్ 23:-మండల కేంద్రంలోని జీవనజ్యోతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ దాలియా,కరస్పాండెంట్ సిస్టర్ అనితా తెలిపారు.ఈ నెల 11,12 తేదీలలో చిత్తూరు జిల్లాలోని మీరేలో నిర్వహించబడిన రాష్ట్ర స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలలో, పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి,ఈ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని సి. మేఘన,8వ తరగతి విద్యార్థినులు హారిక, వైష్ణవి నాయుడు,వర్షిని నాయుడు క్రీడా నైపుణ్యంలో మెరిసి,జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 29నుండి మూడు రోజులపాటు బీహార్ రాష్ట్రంలోని,బిహార్షరీఫ్ (బేగుసరాయి) జిల్లాలో జరగనున్నాయని,ఈ పోటీలలో జీవనజ్యోతి పాఠశాల ప్రతినిధులుగా పై విద్యార్థినులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.పాఠశాల విద్యార్థినులు విద్యా రంగంతోపాటు క్రీడా రంగంలోనూ, ప్రతిభ కనబరుస్తుండడం గర్వకారణమని సిస్టర్ దాలియా తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింతగా పెంచాలని ఆమె ఆకాంక్షించారు.జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను వారు అభినందించారు.ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కుమారి షబ్రిన్, కోచ్‌లు రమేష్,రమేష్ నాయక్ లకు పాఠశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రంపచోడవరం ఏజెన్సీ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిశీలన



**రాజవొమ్మంగి, వజ్ర భారతి, అక్టోబర్ 23. కేవీడీ ప్రభాస్:** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంత పర్యాటక ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రంపచోడవరం మండలం ఐ.పోలవరం పర్యటక ప్రాంతాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కార్తీక మాసంలో మైదాన ప్రాంతం నుండి పర్యటక ప్రాంతాలకు వచ్చిన పర్యాటకులకు కాలువలో స్థానాలకు దిగకుండా హెచ్చరికలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. పర్యటకులు ఎక్కడబడితే అక్కడ చెత్తా చెదారం వేయకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. యువతి యువకులు ఈ పర్యటక ప్రాంతానికి వచ్చి తిరిగి వారి వారి గ్రామాలకు క్షేమంగా వెళ్లే విధంగా సాధ్యమైనంతవరకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట ఎ.పీ.ఎం జి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి...

**అమడగూరు,వజ్ర భారతి అక్టోబర్ 23:-**ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని,శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పిఆర్ఓ భార్గవ్ చంద్ర పేర్కొన్నారు.గురువారం స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో, జానపద వృత్తి కళాకారుల సంఘం సమావేశమై ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.సోమేశ్వర్,జానపద వృత్తి కళాకారుల సంఘం వారు మాట్లాడుతూ, శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి వారిచే జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో, ఈనెల 26న (ఆదివారం) అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో ఆర్డిటి స్కూల్ దగ్గర,ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కావున ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల మండల అధ్యక్షులు నరసింహులు,కార్యదర్శి ఆదినారాయణ, గురువులు, వెంకటరమణ,రామ్మోహన్,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాద స్థితిలో సున్నంపల్లి సోమావతి నది.... అనే వజ్ర భారతి కథనానికి స్పందించిన అధికారులు

**వంతెన మరమ్మత్తులు చేపట్టిన స్థానిక సర్పంచ్ దారా లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి పద్మజ**





ఓడి చెరువు అక్టోబర్23:-మండల పరిధిలోని సున్నంపల్లి సోమావతి నది వంతెన ఇంతకు మునిపే తెగిపోయి ఉండడం వలన, తరువాత స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవమ్మ తనయుడు దారా నాగేంద్ర చొరవతో,మట్టితోలి తాత్కాలిక మరమ్మత్తులు చేయడం జరిగింది.కానీ ప్రస్తుతం ఇప్పుడు అక్కడక్కడ గుంతలు గండి పడడం వల్ల,"ప్రమాదంలో సున్నంపల్లి సోమావతి వంతెన అనే కథనం వజ్ర భారతి"దినపత్రికలో వార్త ప్రచురించడం వలన స్పందించిన స్థానిక సర్పంచు కుమారుడు యువసేవకుడు దారా నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి పద్మజ వీరి ఆధ్వర్యంలో, శరవేగంగా సున్నంపల్లి సోమావతి నది వంతెన మట్టితో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు.ప్రజలు పడుతున్న ఇబ్బందులు పై "వజ్ర భారతి" దినపత్రిక ప్రచురించిన కథనానికి స్పందించి,తక్షణమే మరమ్మత్తులు చేపట్టిన ప్రజాప్రతినిధులకు "వజ్ర భారతి" దినపత్రికకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రియా ప్రతినిధులు,అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఏ మల్లవరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆట స్థలం అభివృద్ధిని చేపట్టిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా



**ప్రత్తిపాడు వజ్రభారతి ప్రతినిధి. ఎం.వీరబాబు అక్టోబర్ :- 23 :** రౌతులపూడి మండలం ఏ. మల్లవరం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఆట స్థలం లేకపోవడంతో క్రీడా కార్యక్రమాలకు దూరమవుతున్నారనే విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా వెంటనే స్పందించారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంత ముఖ్యమో గుర్తించి, తన సొంత నిధుల నుండి లక్ష రూపాయల విరాళాన్ని గురుకుల పాఠశాల అభివృద్ధి కోసం అందజేశారు. ఈ నిధులతో ఆట స్థలాన్ని అభివృద్ధి చేసి, విద్యార్థులు ఆడుకునేందుకు మరియు శిక్షణ పొందేందుకు అనుకూలమైన వాతావరణం సృష్టించాలని ఎమ్మెల్యే పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. స్థలాన్ని అందంగా తీర్చిదిద్ది చిన్నారులు సంతోషంగా ఆడుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా మాట్లాడుతూ "విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠ్య విద్యతో పాటు క్రీడలు కూడా అత్యంత అవసరం. క్రీడలు శారీరక దృఢత్వం మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయి. భవిష్యత్తులో ఈ పాఠశాల అభివృద్ధికి వ్యక్తిగతంగా మరియు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాను" అని అన్నారు. ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వసతుల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు, క్రీడా పరికరాలు, సాంకేతిక సదుపాయాల పెంపు పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సత్య ప్రభ సహకారం మరువలేనిది అంటూ విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు....



## గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిపివేత

### పర్యవేక్షిస్తున్న మండల తహసిల్దార్ నాగరాజు

**బాపట్ల జిల్లా (వజ్రభారతి) అక్టోబర్ 23:** కారంచేడు మండలం కేశవరపాడు, తిమిడితపాడు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు వాగు ఉధ్ధృతి పెరగడంతో రెండు గ్రామాల మధ్య వాహనాల రాకపోకలను నిలిపివేయాలని తహసిల్దార్ కు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదేశం రెండు గ్రామాల మధ్య వాగుకు ఇరువైపులా రహదారులకు కంచె ఏర్పాటు. వాగు దాటకుండా వాహనాల నియంత్రణకు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది నియామకం వాగులో నీరు తగ్గేవరకు ఆ గ్రామాల ప్రజలు పూసపాడు, దగ్గుబాడు గ్రామాల రహదారులను వినియోగించుకోవాలని ప్రజలకు సూచన వాగు వద్ద పరిస్థితులను పర్యవేక్షిస్తున్న మండల తహసిల్దార్ నాగరాజు

## వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



అమడగూరు,వజ్ర భారతి అక్టోబర్ 23:-మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో భూమి పూజను చేపట్టారు.మండలంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం సంతోషంగా ఉందన్నారు.వాల్మీకుల్లో ఎంతో చైతన్యం వచ్చిందని,వాల్మీకి సంఘం వారు కలిసికట్టుగా వచ్చి ఈ విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేసుకుందామని అన్నారు.ఈ కార్యక్రమంలో చెవుటి.నరసింహులు,రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## నిప్పులపై నడిచిన ఐఏఎస్ అధికారిణి...

**కర్ణాటకలోని హసనాంబ ఆలయంలో నిప్పుల గుండం తొక్కిన జిల్లా డిప్యూటీ కమిషనర్**

**భక్తులను చూసి స్ఫూర్తి పొందానన్న అధికారిణి లతా కుమారి**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో**

కర్ణాటకలో ఓ ఐఏఎస్ అధికారిణి తన భక్తిని చాటుకున్నారు. హసన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ) కేఎస్ లతా కుమారి, ప్రసిద్ధ హసనాంబ ఆలయంలో జరిగిన అగ్నిగుండం (కెండోత్సవం) కార్యక్రమంలో పాల్గొని, నిప్పులపై నడిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిప్పు కణికలపై ఆమె నడుస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.హసనాంబ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా, గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా 'కెండోత్సవం' నిర్వహించారు. ఏడాది పాటు ఆలయ గర్భగుడిని మూసివేసే ముందు ఈ క్రతువును జరపడం ఆనవాయతీ. ఈ కార్యక్రమంలో డీసీ లతా కుమారి స్వయంగా పాల్గొని, కణకణలాడే నిప్పులపై చెప్పులు లేకుండా నడిచారు. గులాబీ రంగు చుడీదార్ ధరించిన ఆమె, నిప్పులపై నడుస్తున్నప్పుడు అక్కడున్న భక్తులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.ఈ సందర్భంగా లతా కుమారి మీడియాతో మాట్లాడుతూ, "భక్తులు పవిత్ర కలశాలు పట్టుకుని నిప్పులపై నడుస్తుండటం చూసి నాకు స్ఫూర్తి కలిగింది. ఇంతకుముందెప్పుడూ నేను ఇలా నిప్పులపై నడవలేదు. మొదట కొంచెం భయపడ్డాను, కానీ దేవుడిపై విశ్వాసంతో దండం పెట్టుకుని నడిచేశాను. నాకేమీ కాలేదు" అని తెలిపారు.

# గోవులను రోడ్డు ప్రమాదాల నుంచి రక్షించండి

**శ్రీ ఖాద్రీ లక్ష్మీ నృసింహా సేవా సమితి సభ్యులు లక్ష్మణ కుటాల....**



కదిరి,వజ్ర భారతి అక్టోబర్ 23:-కదిరి పట్టణంలో నిత్యం గోవులు రోడ్డు ప్రమాదాలబారిన పడి గాయాలుపాలు అవుతున్నాయని, శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహ సేవా సమితి సభ్యులు లక్ష్మణ్ కుటాల పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కదిరి పట్టణంలో నిత్యం ఏదో ఒక ప్రమాదంలో గోగులో గాయాలు పాలవుతున్నాయని,రోడ్డు ప్రమాదాల వల్ల గోవులు ఒక్కొక సందర్భంలో ప్రాణాలను సైతం కోల్పోతున్నాయని,ఈరోజు కూడా కదిరి పట్టణం కాలేజీ సర్కిల్ నందు ఒక ఎద్దును గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోవడం జరిగిందని, ఆ గోవు తీవ్ర రక్తస్రావంతో ఇబ్బంది పడుతున్న ఎద్దును చూసిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు,వెంటనే కదిరి వైద్య సిబ్బంది ఎల్ ఎస్ ఏ బాలాజీ, ఏ .డి శ్రీనివాసుల రెడ్డి కి సమాచారం అందించిన తక్షణమే, తమ సిబ్బంది అయినటువంటి లక్ష్మి కాంత్ రెడ్డి, శ్రీ ఖాద్రీ లక్ష్మీ నృసింహ సేవా సమితి సభ్యుల సహకారంతో ఆ ఎద్దుకు వైద్యం అందించడం జరిగిందని ఆయన తెలిపారు.ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు,పట్టణ ప్రముఖులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా, కదిరి పట్టణంలో ఒక గోశాలను ఏర్పాటు చేసి,గోవులు నిత్యం గాయాలపాలు కాకుండా గోశాలకు తరలించి, వాటికి రక్షణ కల్పించాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.అదే విదంగా వాహనాల్లో ప్రయాణం చేసే వాళ్ళు కన్ను మిన్ను కనపడకుండా వాహనాలు నడిపి,ఇలా మూగజీవాల రోదనలకు కారణం కావద్దని,వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



# ఎం.కె.ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం విజయవంతం

**నల్గొండ జిల్లా వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**

నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతంలో ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) దేవరకొండ నుంచి ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం చివరి రోజులో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి హాజరై ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్ల సేవాభావాన్ని కొనియాడుతూ వారికి సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య సి ఓ ఈ జి లింగారెడ్డి ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ వి. మకట్లాల్ ఎస్కే.ఆరిఫా తదితర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రెండు లక్షల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మేరీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల రూపాయల ఎల్ఓసిని గురువారం క్యాంపు కార్యాలయంలో మేరీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా అందజేశారు, ఈ సందర్భంగా బాధితులు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియడం జరిగింది.

# ఆడపిల్లలు అసాంఘిక ముఠాల చేతిలో అభద్రతకు లోన్ కావొద్దు

### అత్యాశనకు పోయి ఆడపిల్లల జీవితాలు నాశనం చేసుకోవద్దు

### ఎం డి ఆర్ ఫౌండేషన్



**పటాన్ చెరువు వజ్రభారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:** రోజూ మనం చూస్తున్న సమాజం వెనుక దాగి ఉన్న చీకటి కోణాల్లో జరుగుతున్న కుట్రల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఈ పోస్టు ద్వారా తెలియజేస్తున్నాము. ఎండిఆర్ ఫౌండేషన్‌కు సహాయం కోసం వచ్చిన ఒక యువతి (సోనాలి) ముంబై నుండి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన స్నేహితురాలిపై నమ్మకంతో పటాన్ చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్‌కి వచ్చింది. అయితే అక్కడ తను తెలిపిన సమాచారం ప్రకారం, ఆమెను వ్యభిచారానికి ప్రేరేపించేందుకు ప్రయత్నించారని తెలిపింది (సోనాలి చెప్పిన విషయం మాత్రమే, ఈ విషయం నిర్ధారించబడలేదు)తాను నిరాకరించడంతో తనపై దాడి చేసి, మొబైల్ ఫోన్‌ను గుంజుకున్నారని తెలిపింది. తన ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా మాత్రమే ముంబై వెళ్లగలుగుతానని, లేకుంటే ఎక్కడికి వెళ్లాలో తెలియదని బాధితురాలు చెప్పింది. దీనిపై ఎండిఆర్ ఫౌండేషన్ నాయకులు ఆమెకు కావాల్సిన సహాయాన్ని అందించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సూచించారు. అలాగే ముంబై వెళ్లేందుకు అవసరమైన బస్సు చార్జీని అందించి, ఫోన్‌ను తిరిగి పొందేలా సహాయం చేశారు.

**ఎండిఆర్ తరపున సందేశం:**

- వయసు వచ్చిన తర్వాత ఎవరినీ అంధంగా నమ్మి బయటకు వెళ్లకండి.
- సమాజంలో కనిపించే మంచితనానికి వెనుక దాగి ఉండే మోసపూరిత కోణాలను గుర్తించండి.
- తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై మరింత శ్రద్ధ వహించాలి.

# జిల్లా కలెక్టర్ చేత ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్న ఏపిఎం మార్గం గౌరీ శంకర్



**మెదక్ జిల్లా వజ్రభారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:** మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి పోషణ మాసం సంబరాల లో భాగంగా జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఘనంగా సన్మానించడం జరిగింది, ఈ సందర్భంగా ఐకెపి సెర్ప్ డిపార్ట్మెంట్ నుండి ఏపిఎం మార్గం గౌరీ శంకర్ ను ఉత్తమ ప్రతిభా పురస్కారం కు ఎంపిక చేసి కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ప్రతిష్టాత్మకంగా సన్మానించి పురస్కారాన్ని అందించడం జరిగింది, అనంతరం ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న ఏపీఎం మార్గం గౌరీ శంకర్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈ పురస్కారాన్ని కి ఎంపిక చేసిన అధికారులకు జిల్లా కలెక్టర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు, జెడ్పి సీఈవో ఎల్లయ్య, అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి,డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ హేమ భార్గవి, ఇతర జిల్లా స్థాయి అధికారులు, ఐసిడిఏ సూపర్వైజర్లు,అంగన్వాడి కార్యకర్తలు ఆశ వర్కర్లు ఇతర శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

# అయ్యప్ప స్వామి మహా పాదయాత్ర పూజ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**నల్గొండ జిల్లా వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నల్గొండ జిల్లా చింతపల్లి మండలం గోడుకొండ్ల గ్రామం వీకె నగర్లో కొలువైన శబరికొండ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో జరిగిన మహా పాదయాత్ర పూజ కార్యక్రమంలో భక్తులతో, నాయకులతో కలిసి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొనడం జరిగింది,అనంతరం నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ పవిత్రమైన ఈ కార్తీక మాసంలో అయ్యప్ప భక్తులు ధరించే స్వామి మాలలు ఎంతో పవిత్రతను చాటుకుంటారని అన్నారు. అయ్యప్ప మాల ధరించి శబరిమల వరకు పాదయాత్రగా వెళ్ళే భక్తులను మనస్ఫూర్తిగా అభినందిస్తూ ఆశీర్వదిస్తూ అయ్యప్ప స్వామి కృపతో అందరికీ మంచి జరగాలని కోరుకోవడం జరిగింది. ఈయొక్క పూజా కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు - సంజీవ రెడ్డి, చింతపల్లి మండలం మాజీ ఎంపీపీ కొండూరు భవాని - పవన్ కుమార్, మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి, మండల మాజీ వైస్ ఎంపీపీ యాది గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్ గార్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గురు స్వాములు అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

# ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా మెదక్ పట్టణంలో భారీ క్యాండిల్ ర్యాలీ





### పోలీస్ అమరవీరులకు శాంతి కలగాలి

### ర్యాలీ ప్రారంభించిన జిల్లా అదనపు ఎస్ పి మహేందర్

మెదక్ జిల్లా వజ్రభారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో: మెదక్ జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా అక్టోబర్ 23 సాయంత్రం 6:30 గంటలకు మెదక్ పట్టణంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, పట్టణ యువత సమన్వయంతో ఘనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది చేతిలో క్యాండిల్ పట్టుకొని అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత తెలంగాణ ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతలు ఇవన్నీ ఒకప్పటి పోలీసు అమరవీరుల త్యాగ ఫలితమే అని అన్నారు. ర్యాలీ మొత్తం జోహార్ జోహార్ అమరవీరులకీ అంటూ నినాదాలతో సాగి రాందాస్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ డి. ప్రసన్న కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీ రంగా నాయక్, టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, మెదక్ రూరల్ సీఐ జార్జ్, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు సత్యనారాయణ, మల్లికార్జున్, పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఇవేమీ శిక్షలు..? ఎంతకాలమీ కులకక్షలు..?

ఓ మిత్రమా..!
ఇదేమి న్యాయం..?ఇదెక్కడి ధర్మం..?
చిన్న తప్పుకి పెద్దశిక్ష విధించడమా..?
మనిషితో మూత్రం త్రాగించడమా..?
ఏంతటి మూర?త్వమిది..?
ఏంతటి అమానుషత్వం..?
ఏంతటి అహంకారం..? కాదా ఇది
ఆత్మగౌరవానికి...అగ్నిపరీక్ష...?

నగరంలో నరకం ఒకజాతికి...
ఇల్లు అద్దెకు దొరకని దుస్థితి...
మూసుకుంటున్నాయి...
ఇంటితలుపులు..కులం పేరు వింటే...
తెరుచుకోకున్నాయి...మది తలపులు..!

పల్లెల్లో కులపిచ్చి ముదురుతోంది...
ఏళ్ల తరబడి మంటలు ఆరకున్నాయి..
అసహనం పొగలు కమ్మేస్తున్నాయి...!

నేడు మర్రి మానుగ మారిన
ఆ కులం మొక్కను నాటిన
ఆ "మూర?పు కుక్క" ఎవరో...!

ఇక్కడ తరతరాలుగా
బడుగు బలహీన వర్గాలు
అంటరానితనపు అగ్నిలో
గిలగిల కొట్టుకుంటూ ఉంటే
అక్కడ నరకంలో ఆ కుక్క
సలసల కాగే నూనెలో పడి
మలమల మాడిపోయి ఉంటాడు..!

విషం తేలుకు కొండీలో పాముకు కోరల్లో
మనిషికి నిలువెల్లా కులవివక్ష విషమే..!

ఇలాంటి దుష్కార్యాలకు పాల్పడే
నీచ నికృష్ట నీతిమాలిన దుర్మార్గులు
వీధుల్లో వీరుల్లా విర్రవీగుతూ తిరగడం...
అది అసాంఘిక శక్తుల శివతాండవమే..!

నాడు రౌడీ షీటర్లను గుండుగీచి
ఊరంతా గాడిదలపై ఊరేగించేవారు..!

నేడు చట్టాలు నేతలకు చుట్టాలు
మారాల్సింది చట్టాలు కాదు
మన పాషాణ హృదయాలు
కోరాల్సింది న్యాయం కాదు
మన సామాజిక దృక్కోణం..!

అందరొచ్చేది ఆ తల్లిగర్భం నుంచే...
తిరిగెళ్ళేది ఆ భూమాత గర్భంలోకే...
అందరిలో ప్రవహించే రక్తం ఒక్కటే...
అందరం మానవులమే ఒకతల్లి బిడ్డలమే

ఎందుకు కులమత విబేధాలు వివాదాలు
"ఆరిపోవాలి అంటరాతనపు అగ్నిగుండం
"కూలిపోవాలి...కులమత విషవృక్షాలు"..!

రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్




## జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ విస్తృత ప్రచారంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్



**హైదరాబాద్ వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:**

హైదరాబాదులోని బై ఎలక్షన్ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ పటాన్చెరు సీనియర్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల్లో పార్టీ పట్ల విశేషమైన ఉత్సాహం నెలకొని, ప్రచార కార్యక్రమం భారీ విజయవంతంగా సాగింది అన్న. బి ఆర్ ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందిఅని అన్నారు. ప్రచారంలో ప్రజలు బి ఆర్ ఎస్ పార్టీ ని అధికంగా ఆదరించి అభిమానిస్తున్నారు అని విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ సోమిరెడ్డి , మీరాజ్ ఖాన్,దేవేందర్ యాదవ్, మహేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.

## వెజిటేబుల్ మార్కెట్ అభివృద్దే లక్ష్యం..

### కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 రిపోర్టర్ (అరుణ్ రాజ్ ):-** శేరిలింగంపల్లి డివిజన్ లోగల నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ లో నూతనంగా చేపడుతున్న పునర్నిర్మాణం పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీతో కలిసి పర్యవేక్షించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ సందర్భంగా సుందరీకరణతో మార్కెట్ ను ఆదర్శంగా తీర్చితిద్దుతామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన అత్యవసర పనులను గుర్తించి పనులు చేపడుతున్నట్లు అన్నారు. మార్కెట్ అభివృద్ధితో పాటు చిరు వ్యాపారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, కే రాంచందర్, విష్ణువర్ధన్ రెడ్డి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా పాషా, రషీద్, అజీమ్, అస్లాం, శ్రీనివాస్, శంకర్, ఆంజనేయులు, అజామ్, సాయి, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పటాన్చెరు అభివృద్ధికి నూతన ఊపిరి

### మూడు మున్సిపాలిటీలకు రూ.45 కోట్ల నిధులు

### అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబాటుకు కృతజ్ఞతలు తెలిపిన కాట శ్రీనివాస్ గౌడ్



సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల, ఇస్నాపూర్ మరియు గడ్డపోతారం మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు చొప్పున మొత్తం రూ.45 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కి, రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కి పటాన్చెరు నియోజకవర్గ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపిన పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, ఈ నిధులు మున్సిపాలిటీలలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య సదుపాయాలు, వీధి లైటింగ్ ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించబడతాయని ఆయన పేర్కొన్నారు. పటాన్చెరు పరిసర ప్రాంతాల ప్రజల ఎన్నేళ్ల అభివృద్ధి ఆశలను ఈ నిర్ణయం నెరవేర్చిందని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ ప్రజాహిత నిర్ణయం పటాన్చెరు ప్రాంతం సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుందని కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

# ఆరోగ్యంపట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలి

### ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలి

### మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

### తెలంగాణ మీడియా అకాడమీచైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ వజ్రభారతి న్యూస్ అక్టోబర్ 23 తెలంగాణ రాష్ట్ర బ్యూరో:** కంటి నిండా నిద్దర లేకుండా, కడుపునిండా తిండి లేకుండా విధినిర్వహణలో భాగంగా నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం నాడు దిల్ సుఖ్ నగర్ లోని లిఖిత డయాగ్నోస్టిక్ సెంటర్ లో, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, జర్నలిస్టులకు నిర్వహించిన మెఘా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు లేక పోవడంతో రాష్ట్రంలో వందల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగిందని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టినట్లు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలో అకాల మరణం చెందుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న జర్నలిస్టులకు మీడియా అకాడమీ ద్వారా కొంతమేరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆయా ఆసుపత్రుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ, జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే సంఘం అండగా నిలబడడం అభినందనీయమన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎలాంటి జీత భత్యాలు లేకుండా శ్రమిస్తున్న జర్నలిస్టులు దీనస్థితిలో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో పిల్లలకు చదువులు, వైద్య ఖర్చులు వారికి మోయలేని భారంగా మారాయని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఆయా ప్రభుత్వాలు జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు ఇచ్చినట్లే ఇచ్చి లాక్కోవడం సహించరానిదన్నారు. జర్నలిస్టుల కనీస అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాజేందర్ కోరారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ,జర్నలిస్టుల సంక్షేమం పట్ల ఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోతుందని, ఆయా రాజకీయ పార్టీలు వారి అవసరాల కోసం జర్నలిస్టులను యూజ్ అండ్ త్రోగా ఉపయోగించుకోవడం విచారకరమన్నారు. జర్నలిస్టుల కనీస అవసరమైన ఆరోగ్య భద్రతా పట్ల ఏ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని, ఈ పరిస్థితుల్లోనే తమ సంఘం ప్రైవేట్ ఆసుపత్రుల సహకారంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటివరకు 10చోట్ల ఈ క్యాంపులను నిర్వహించి దాదాపు 4వేల మందికి ఆరోగ్యపరంగా సహకారాన్ని అందించినట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా అధ్యక్షతన ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు బుగ్గారపు దయానంద్, తెలంగాణ రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ రంగ నర్సింహా గుప్తా, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, సీనియర్ నాయకులు రాధాక్రిష్ణ, ప్రవీణ్, నర్సింహా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## జున్నూరు కృష్ణ రైస్ మిల్, రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

### ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కొరకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి అధికారులకు ఆదేశాలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**పోడూరు , వజ్రభారతి, అక్టోబర్ 23, పశ్చిమగోదావరి జిల్లా, ప్రతినిధి :** పోడూరు మండలంలోని జున్నూరులో కృష్ణ రైస్ మిల్లును, రైతు సేవ కేంద్రంను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో గోనె సంచులు నాణ్యతను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ 2025-26 రైతులు నుండి కొనుగోలు చేసే ధాన్యం కొనుగోలు రైస్ మిల్లర్స్ సప్లై చేసే గోనె సంచులు డామేజీలు లేకుండా నాణ్యతతో ఉండాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు గోనె సంచులు పంపేందుకు సిద్ధం చేయాలని రైస్ మిల్లర్స్ ప్రతినిధులు ఆదేశించారు. ఈ సందర్భంగా జున్నూరు రైతు సేవ కేంద్రం ను సందర్శించారు అగ్రికల్చర్ సిబ్బందికి, వి ఏ లు కు పలు సూచనలు జారీ చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు సంబంధించిన సమాచార వివరాలను డిస్ప్లే బోర్డుల ద్వారా ప్రదర్శించాలన్నారు. తేమ శాతం తెలిపే మీటర్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లకు పటిష్ట ఏర్పాటు చేయాలని అన్నారు. ప్యాడి, ఆక్వాకల్చర్, హార్టికల్చర్, బంజర భూములు, ఈ క్రాఫ్ట్ ఎలా నమోదు చేయాలి తదితర వివరాలను విఏ లకు అగ్రికల్చర్ సిబ్బందికి జాయింట్ కలెక్టర్ వివరించారు. అనంతరం పోడూరు తహసిల్దార్ కార్యాలయంను సందర్శించారు. మండలంలోని పి జి ఆర్ ఎస్ పిటీషన్లు పరిష్కారం పై . తహసిల్దార్, వీఆర్వోలతో సమీక్షించారు. పి జి ఆర్ ఎస్ పిటీషన్లు పరిష్కరించడంలో తీసుకునే చర్యలు పై దిశ నిర్దేశములను చేశారు. ఫిర్యాదుదారునితో స్వయంగా మాట్లాడి క్వాలిటీతో పరిష్కార చర్యలు. తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంలో తహసిల్దార్ ఎం.ఎస్ పాజిల్, మండల వ్యవసాయ శాఖ అధికారి విశ్వేశ్వరరావు, ఆరెఆర్ఐ, వీఆర్వోలు, తదితరులు ఉన్నారు.







## ఘనంగా అనిల్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి వజ్ర భారతి న్యూస్ అక్టోబర్ 23 రిపోర్టర్ (అరుణ్ రాజ్ ): -** శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీదు బండ నివాసంలో మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు అభిమానులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పూలమాలలతో బ్యాండ్ సప్పులతో ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆటో యూనియన్ వారికి యూనిఫామ్ అందజేసిన అనిల్ కుమార్ యాదవ్. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నా జన్మదిన సందర్భంగా విచ్చేసిన మహిళలకు పార్టీ కార్యకర్తలకు అభిమానులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని అన్నారు, నా వెంటే ఉండే ప్రజలందరికీ ఉండే ప్రజలందరికీ నేను మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని ఈ సందర్భంగా మాటిస్తున్నాను. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజమ్,మహేష్ యాదవ్, రోనిత యాదవ్,శామ్యూల్ కార్తీక్, గాఫర్, ముక్రమ్, నగేష్, నరేష్, పవన్, శ్రీకాంత్, అలీ, బేరి రాంచందర్ యాదవ్,పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం అప్ డేట్

### స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పు తర్వాతే ప్రభుత్వ నిర్ణయం

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

### వచ్చే నెల 7న మరోసారి కేబినెట్ భేటీ

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నొక్కిచెప్పారు. ఈ అంశంపై నవంబర్ 3న హైకోర్టులో విచారణ జరగనుందని తెలిపారు. “ఉన్నత న్యాయస్థానం నుంచి తీర్పు రాగానే, కేబినెట్లో చర్చించి స్థానిక ఎన్నికలపై తుది నిర్ణయం తీసుకుంటాం. ఈ క్రమంలో నవంబర్ 7న మరోసారి కేబినెట్ సమావేశం అవుతుంది” అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు.ఈ సమావేశంలో కేవలం ఎన్నికల అంశమే కాకుండా పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



## ఆరోగ్య కేంద్రాల్లో నిత్యం వైద్య సేవలు అందాలి జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**పల్నాడు :నరసరావు పేట, వజ్ర భారతి ప్రతినిధి : అక్టోబరు 23:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24ఐ7 వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. షిఫ్టుల వారీగా విధులు కేటాయించి స్టాఫ్ నర్సులు అన్ని వేళలా డ్యూటీలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య సేవలు మెరుగుపరిచేందుకు మండలాల వారీగా మెంటర్లను క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ మరియు వెల్ నెస్ కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిర్మాణ సమస్యలు పరిష్కరించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు, కొరత ఉన్న ఇతర సిబ్బంది నియామక ప్రక్రియ చేపట్టాలన్నారు. చెంచులకు ఆరోగ్య శ్రీ, జన ఆరోగ్య యోజన కార్డులు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.రవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి, డీసీహెచ్ఎస్ ప్రసూన, పంచాయతీ రాజ్ ఎస్ఈ కె. ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిజాం ఆస్తులపై కోర్టు కీలక నిర్ణయం

**ఏడో నిజాం ఆస్తుల పంపకాల వివాదంలో కీలక పరిణామం**

**ముఖరం జా వారసుల మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు**

**రూ.10,000 కోట్లకు పైగా విలువైన 5 రాజమహళ్లపై దావా**



నజఫ్ అలీ ఖాన్ వేసిన పంపకాల దావా పూర్తి విచారణకు మార్గం సుగమం

షరియత్ చట్ట ప్రకారం వారసులందరికీ హక్కు ఉందని వాదనఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు చెందిన వేల కోట్ల రూపాయల విలువైన రాజమహళ్ల పంపకాల వివాదంలో ఆయన వారసులకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఆస్తుల పంపకాలపై దాఖలైన దావాను కొట్టివేయాలని కోరుతూ ఎనిమిదో నిజాంగా గుర్తింపు పొందిన ముఖరం జా కుమారుడు అజ్మత్ జా, కుమార్తె షెకర్ జా దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు గురువారం తోసిపుచ్చింది. దీంతో అసలు కేసులో పూర్తిస్థాయి విచారణకు మార్గం సుగమమైంది.ఏడో నిజాం మనవళ్లలో ఒకరైన నవాబ్ నజఫ్ అలీ ఖాన్, తన తాత ఆస్తులను వారసులందరికీ పంచాలని కోరుతూ 2021లో ఈ దావా వేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్, చౌమహల్లా ప్యాలెస్, పురానీ హవేలీ, కింగ్ కోఠి ప్యాలెస్‌తో పాటు ఊటీలోని హేర్‌వుడ్ అండ్ సెడార్స్ బంగ్లా వంటి ఐదు చారిత్రక ఆస్తుల పంపకం జరగాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ ఆస్తుల ప్రస్తుత విలువ రూ.10,000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.ఈ కేసును విచారణకు స్వీకరించవద్దని అజ్మత్ జా, షెకర్ జా కోర్టును ఆశ్రయించారు. అయితే నజఫ్ అలీ ఖాన్ తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపిస్తూ, ఏడో నిజాం చట్టబద్ధమైన వారసుడిగా పిటిషనర్‌కు పూర్వీకుల ఆస్తులపై హక్కు ఉందని తెలిపారు. ఆస్తుల యాజమాన్యం, వాస్తవాధీనం, విలువ వంటి అంశాలను పూర్తిస్థాయి విచారణ ద్వారానే తేల్చగలమని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసి, అసలు దావా విచారణకు అనుమతించింది.1967 ఫిబ్రవరి 24న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మరణించిన తర్వాత, భారత ప్రభుత్వం ఆయన మనవడు ముఖరం జాను వారసుడిగా గుర్తించింది. అయితే, నిజాం ప్రైవేట్ ఆస్తులను ఇస్లామిక్ షరియత్ చట్టం ప్రకారం ఆయన 34 మంది సంతానానికి సమానంగా పంచాలని, కేవలం ఒకే వ్యక్తి ఆస్తులను అనుభవించడం సరికాదని నజఫ్ అలీ ఖాన్ వాదిస్తున్నారు. ఈ కేసులో మొత్తం 232 మంది ప్రతివాదులుగా ఉండగా, వారిలో ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్వహిస్తున్న ఇండియన్ హోటల్స్ కంపెనీ కూడా ఉంది.

# మహిళలకు రక్షణ కల్పించలేని టీడీపీ కూటమి ప్రభుత్వం గద్దె దిగాలి

**రాజమహేంద్రవరం, వజ్ర భారతి, అక్టోబర్ 23, (ఎండి నజీర్ అహ్మద్ ):** ఈవీఎం ఎమ్మెల్యే చేతకాని తనం వల్ల రాజమండ్రిలో మహిళలపై అత్యాచారాలు 24 గంటలూ మద్యం విక్రయించి తాగించడం వల్ల మహిళలపై పెరిగిన అత్యాచారాలు మాజీ ఎంపీ మార్గాని భరత్ జాంపేట బాలికల వసతి గృహం వద్ద జోరు వర్షంలో భరత్ ఆధ్వర్యంలో ధర్నా రాజమహేంద్రవరం కూటమి ప్రభుత్వ అసమర్ధ అరాచక పాలనలో రాష్ట్రంలో నిత్యం మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని మాజీ ఎంపీ,రాజమండ్రి సిటీ వైసీపీ అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ మండిపడ్డారు.మహిళలకు రక్షణ కల్పించలేని టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణం రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాజమండ్రి గణేష్ చౌక్ బాలికల వసతి గృహంలోని విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసన వ్యక్తం చేస్తూ గురువారం వసతి గృహం వద్ద భరత్ ఆధ్వర్యంలో ధర్నా జరగింది.జోరున వర్షం కురుస్తున్నా వైసీపీ శ్రేణులు ధర్నా చేసి టీడీపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మార్గాని భరత్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం హయాంలో రోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని,తెలియకుండా ఇంకా ఎన్నో జరుగుతున్నాయని ఆరోపించారు.24 గంటలూ మద్యం విక్రయించి తాగించడం వల్ల మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆయన వ్యాఖ్యానించారు.రాజమండ్రి సిటీలో




ఈవీఎం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేతకానితనం వల్ల నియోజకవర్గంలో మహిళలపై అత్యాచారాలు పెరిగాయని ఆయన ఆరోపించారు.ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడే ఒక మహిళను ప్రేమ పేరుతో నమ్మించి మోసగించి గర్భవతిని చేసి తర్వాత గర్భంలో పిండాన్ని చిదిమేశారని మార్గాని భరత్ మండిపడ్డారు.ఇప్పుడు బాలికల వసతి గృహంలోని విద్యార్థినిని దీపావళి రోజు బయటకు తీసుకువెళ్ళి అత్యాచారం చేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ వసతి గృహంలోని బాలికలకు రక్షణ లేదని ఇదంతా ఈవీఎం ఎమ్మెల్యే చేతకాని తనం వల్లనే జరుగు తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ధర్నాకు పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా వైసీపీ శ్రేణులు తమ ఆందోళన కొనసాగించాయి.

# అత్యాచార బాధిత కుటుంబానికి అనుశ్రీ భరోసా

**రాజమహేంద్రవరం, వజ్ర భారతి, అక్టోబర్ 23 (ఎండీ నజీర్ అహ్మద్):** జీజీహెచ్లో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబ సభ్యులను పరమర్శించిన జనసేన రాజమహేంద్రవరం నగర నియోజకవర్గ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని జనసేన రాజమహేంద్రవరం నగర నియోజకవర్గ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్లో చికిత్స పొందుతున్న బాలిక కుటుంబ సభ్యులను బుధవారం సాయంత్రం ఆయన పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరొక సారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఇప్పటికే రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శివ గణేష్ తో మాట్లాడామన్నారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.. ఇది హేయమైన చర్య. దీనిని జనసేన పార్టీ తరఫున ఖండిస్తున్నామన్నారు. కాకినాడ జిల్లా తునిలో జరిగిన ఘటన సైతం కలవరపెట్టిందన్నారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్ష పడాలన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్టల్లో పిల్లలు




ఉన్నప్పుడు వారు వెళ్తేనే పిల్లల్ని పంపించాలని స్పష్టంగా చెప్పాలన్నారు. వార్డెన్లు నిర్లక్ష్యంగా ఉండకూడదన్నారు. ఎవరుపడితే వారితో పిల్లల్ని పంపకూడదన్నారు. తల్లితండ్రులు ఎక్కడో ఉంటారు కాబట్టి బాలికల సంరక్షణలో వార్డెన్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గంటా స్వరూప ఏపీ టూరిజం డైరెక్టర్, గుత్తుల సత్యనారాయణ జనసేన పార్టీ సిటీ ఉపాధ్యక్షులు, వీరబాబు సిటీ ప్రధాన కార్యదర్శి, శ్యాంసుందర్ సిటీ కార్యదర్శి,, సూర్య యువ నాయకులు, ఎండోమెంట్స్ డైరెక్టర్స్ షాలిని, గౌతమి, వీర మహిళలు సూర్య కుమారి, కూరపాటి నాగశ్రీ జన సైనికులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో సెక్స్ రాకెట్ గుట్టురట్టు... విదేశీ యువతికి విముక్తి

**బంజారాహిల్స్ హోటల్‌లో వ్యభిచారం**

**ప్రధాన నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులు, రిసెప్షనిస్ట్ అరెస్ట్**

**యువతులకు ఉద్యోగాల ఆశ చూపి వ్యభిచారం**

**నిందితుల నుంచి నగదు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గుట్టుగా సాగుతున్న ఓ భారీ వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న ఈ దందాపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిర్వాహకులతో పాటు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా చెర నుంచి ఉజ్బెకిస్థాన్ యువతితో సహా ముగ్గురు మహిళలను రక్షించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఆర్-ఇన్ హోటల్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి హోటల్‌లోని 111, 112 నంబర్ గదులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ప్రధాన నిర్వాహకుడైన ఎండీ షరీఫ్‌ను అరెస్ట్ చేశారు. అతనితో పాటు ఏడుగురు విటులను, హోటల్ రిసెప్షనిస్ట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. విటులంతా కర్నూలుకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.'స్టైల్ మేకర్ సెలూన్' యజమాని అయిన ఎండీ షరీఫ్, ఆర్థికంగా వెనుకబడిన, ఉద్యోగాలు లేని యువతులను లక్ష్యంగా చేసుకుని ఈ దందాను నడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వారికి పెద్ద మొత్తంలో జీతాలు, కమీషన్లు ఇస్తామని ఆశ చూపి వ్యభిచార కూపంలోకి దింపుతున్నాడని పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రూ. 5,950 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 12 వాడని కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ

**గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కవిత లేఖ**

**నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించారని ఆరోపణ**

**ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని సీజేఐకి విజ్ఞప్తి**



తెలంగాణలో ఇటీవలే నియామక ప్రక్రియ పూర్తి చేసుకున్న గ్రూప్-1 పరీక్షపై తీవ్ర దుమారం రేగింది. ఈ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం సంచలనంగా మారింది. గ్రూప్-1 నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని, రాష్ట్రపతి ఉత్తర్వులను సైతం ఉల్లంఘించారని ఆమె తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకోవాలని కవిత తన లేఖ ద్వారా సీజేఐని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితమే హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 562 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన నేపథ్యంలో కవిత ఫిర్యాదు ప్రాధాన్యత సంతరించుకుంది.గ్రూప్-1 పరీక్షల మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు కవిత వెల్లడించారు. ప్రశ్నాపత్రాల అనువాదంలో (ట్రాన్స్‌లేషన్) లోపాల వల్ల ప్రొఫెసర్లు, లెక్చరర్లు సమాధాన పత్రాలను సరిగ్గా మూల్యాంకనం చేయలేకపోయారని, దీంతో మార్కుల్లో భారీ వ్యత్యాసాలు వచ్చాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ఆమె తెలిపారు.అంతేకాకుండా, ప్రిలిమ్స్ పరీక్షకు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్ పరీక్షకు మరో హాల్ టికెట్ నంబర్ కేటాయించడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు.

inted, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P.,
ted at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU